

కోట సత్తెమ్మ తిరునాళ్లు ప్రారంభం





నిడదవోలు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం కోట సత్తెమ్మ తిరునాళ్లు గురువారం నుంచి ఆరంభ మయ్యాయి. వైదిక స్మార్త ఆగమ ఆచారం ప్రచారం దేవులపల్లి వంశస్తులు కలశ స్థాపనతో ఉత్సవాలను ప్రారంభించారు. ఉదయం విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, పంచగ్రవ్య ప్రాసన, మండపారాధన,మహాలింగార్చన, సూర్యనమస్కారాలు, మహాన్యాస పఠనం, అనంతరం కోట సత్తెమ్మ అమ్మవారు ఏకాదశ రుద్రాభిషేకాలు, లక్ష కుంకుమార్చన నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు అప్పారావుశర్మ ఆధ్వర్యంలో మహానివేదన, నీరాజన మంత్ర పుష్పాలు జరిగాయి. దేవులపల్లి రవిశంకర్ దంపతులు, దేవులపల్లి వంశస్థులు పూజల్లో పాల్గొన్నారు. ప్రత్యేక స్వర్ణాభరణాలతో, ప్రత్యేక పూల అలంకరణలో ఉన్న అమ్మవారిని భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.ఈ నెల 8వ తేదీ వరకూ ఉత్సవాలు జరుగుతాయని దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ వి.హరి సూర్యప్రకాష్ తెలిపారు. తెలిపారు.

వీళ్ల ప్రేమను.. సమాధి చేసిన లారీ!

ఇద్దరూ ఇష్టపడ్డారు.. ప్రేమ వివాహం చేసుకున్నారు.. వీరి ప్రేమకు గుర్తుగా మూడు నెలల కిందట పాప జన్మించింది.. ఆనందంగా సాగిపోతోంది జీవితం.. ఆ ఆనందం చూసి విధికి కన్నుకుట్టిందో ఏమో కానీ..లారీ రూపంలో వారిద్దరినీ మృత్యువు కబళించింది.. వారి ప్రేమకు గుర్తుగా పుట్టిన చిరుపాపం మాత్రం తల్లిదండ్రుల వెంట లేకపోవడంతో ప్రమాదం నుంచి బయటపడి అనాథగా మారింది..ఈ విషాద ఘటన రాజానగరం - నరేంద్రపురం కూడలిలో గురువారం జరిగింది.. లారీ అతివేగమే ప్రమాదానికి కారణంగా భావిస్తున్నారు.



7

ఉపాధికి మస్కట్ వెళితే.. హింసకు గురై ఇంటికి..

6



అక్రమ.. పరుగులు!

- లేఅవుట్ల క్రమబద్ధీకరణకు పరుగులు
- ఎల్ఆర్ఎస్‌కు 15598 దరఖాస్తులు
- ప్రభుత్వానికి రూ.127 కోట్ల రాబడి
- గత వైసీపీలో భారీగా అక్రమ లేఅవుట్లు
- చూసీచూడనట్లు వదిలేసిన అధికారులు
- కూటమి అధ్యయనం ..లబ్ధిదారులకు ఛాన్స్

అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణకు ఉమ్మడి జిల్లాలో భారీగా దరఖాస్తులు వెల్లువెత్తుతు న్నాయి. ప్రభుత్వం ప్రకటించిన ఎల్ఆర్ఎస్ పథకానికి అంచనాలకు మించిన స్పందన వ్యక్తమవుతోంది. అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణకు భారీగా దరఖాస్తులు వస్తున్నాయి. ఇప్పటి వరకు 15,598 దరఖాస్తులు పోటెత్తాయి. దీన్ని బట్టి గత వైసీపీ సర్కారు హయాంలో ఏ స్థాయిలో అక్రమ లేఅవుట్లు పురుడు పోసుకున్నాయో అర్థం చేసుకోవచ్చు. మరో పక్క వచ్చిన ఎల్ఎఆర్ఎస్ దరఖాస్తుల ద్వారా ప్రభుత్వానికి రూ.127 కోట్ల వరకు రాబడి రానుంది. అత్యధికంగా తూర్పుగోదావరి జిల్లాలో 7,390 ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు రావడం విశేషం. వచ్చే నెల వరకు గడువు ఉండడంతో వీటి సంఖ్య మరింత పెరగనుంది.

- (కాకినాడ,ఆంధ్రజ్యోతి)

రాష్ట్రప్రభుత్వం ఈ ఏడాది జూలైలో లేఅవుట్ క్రమబద్ధీకరణ పథకాన్ని (ఎల్ఆర్ఎస్) ప్రవేశ పెట్టింది. అనుమతుల్లేకుండా వేసిన లేఅవుట్లను ఈ పథకం ద్వారా క్రమబద్ధీకరించుకునే అవకాశం కల్పించింది. దీంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వేలల్లో దరఖాస్తులు పోటెత్తుతున్నాయి. వాస్తవా నికి 2014-2019 మధ్య అప్పటి టీడీపీ ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ పథకాన్ని తెచ్చింది. ఆ తర్వాత గడువు ముగియడంతో నిలిపివేసింది. అప్పట్లో వచ్చిన దరఖాస్తుల్లో 65 శాతం వరకు పరిష్కరించింది. గత వైసీపీ ప్రభుత్వంలో మళ్లీ అనుమతులు తీసుకోని అక్రమ భవనాలు, లేఅవుట్లు భారీగా పెరిగాయి. అప్పటి అధికార పార్టీ నేతలు, వారి అనుచరులు ఎక్కడికక్కడ అక్రమ లేఅవుట్లు వేసి విక్రయించి కోట్లు గడిం చారు. ఇవన్నీ తెలిసినా అధికారులు పట్టించు కోలేదు. అత్యధికంగా తూర్పుగోదావరి జిల్లాలోని రాజమహేంద్రవరం రూరల్, కొవ్వూరు, నిడద వోలు, రాజానగరం, కాకినాడ రూరల్ నియోజక వర్గాల్లో ఈ తరహా లేఅవుట్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి.

నాటి ధరలే నేడూ..

అనధికార లేఅవుట్లలో స్థలాలు కొనుగోలు చేసిన వారు ఇళ్ల నిర్మించుకునేందుకు అవకాశం లేదు. దీంతో వారంతా లబోదిబోమన్నారు. ప్రభుత్వం మారాక వీటిపై అధ్యయనం చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు.ఈ నేపథ్యంలో ఎల్ఆర్ఎస్ ద్వారా వీటి క్రమబద్ధీకర ణకు ప్రభు త్వం అవకాశం కల్పించింది. ఈ ఏడాది జూన్ 30కి ముందు వేసిన లేఅవుట్లను ఈ పథకం కింద క్రమబద్ధీకరించు కోవడానికి ప్రభుత్వం అనుమతి జారీ చేసింది. 2014- 2019లో అప్పటి టీడీపీ ప్రభుత్వం తీసుకు వచ్చిన ఎల్ఆర్ఎస్‌లో నిర్దే శించిన బేసిక్ ధరలనే ఇప్పుడు నిర్ణయిం చారు. ఎల్ఆర్ ఎస్ అపరాధ రుసుముల కింద ప్లాట్ విస్తీర్ణం చదరపు మీటర్లలో 100 వరకు ఉంటే రూ.200,100-300 ఉంటే రూ.400, 300-500 వరకు రూ.600, 500పైన రూ.750 వరకు వసూలుకు నిర్ణయించారు. లేఅవుట్‌లో 10శాతం ఓపెన్ స్పేస్ లేకపోతే జరిమానాతో పాటు ఈ ఏడాది జూన్ 30వ తేదీ నాటికి ఆ భూమి బేసిక్ విలువలో ఓపెన్ స్పేస్ ఛార్జీల కింద 14 శాతం చెల్లించాలని ప్రభుత్వం ఆదేశించింది. క్రమబ ద్ధీకరణ కింద ఫీజులు 45 రోజుల్లోగా చెల్లిస్తే 10 శాతం, 90 రోజుల్లోగా చెల్లిస్తే ఐదు శాతం రాయితీ ప్రకటించింది. జూలైలో పథకాన్ని ప్రవేశపెట్టగా అక్టోబరు వరకు ప్రభుత్వం గడువిచ్చింది.తిరిగి వచ్చే నెల జనవరి 23వరకు పొడిగించింది.

తూర్పున 7,390..

ఉమ్మడి జిల్లాలో అత్యధికంగా తూర్పుగోదా వరి జిల్లా నుంచి ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు భారీగా పోటెత్తాయి.జిల్లాలో డిసెంబరు 1 వరకు మొత్తం 7,390 ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు వచ్చాయి. రాజమహేంద్రవరం కార్పొరేషన్ పరి ధిలో 1,305, రుడా పరిధిలో 5,266, నిడదవోలు మునిసిపాలిటీ 291, కొవ్వూరు పరిధిలో 528 వచ్చాయి. మొత్తం 5,255 దరఖాస్తుల్లో 1,384 అప్రూవల్ అవగా 522 దరఖాస్తులను తిరస్కరించారు. దరఖాస్తుల ద్వారా ఎల్ఆర్ఎస్ ఆదాయం ప్రభుత్వానికి రూ.60.88 కోట్లు సమకూరనుంది. కార్పొరేషన్ పరిధిలో రూ.27.59 కోట్లు, రుడా ద్వారా రూ.25.78 కోట్లు జమకానుంది.

కాకినాడలో 5,839

కాకినాడ జిల్లాలో 5,839 ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు రాగా రూ.44.71 కోట్లు ఆదాయం రానుంది. అత్యధికంగా కుడా పరిధిలో 4,327, కాకినాడ కార్పొరేషన్ పరిధిలో 316, ఉమ్మడి గుడాలో 305, గొల్లప్రోలు 55, పెద్దాపురం 115, పిఠాపురం 453, సామర్లకోట 58, తుని 149, ఏలేశ్వరంలో 59 చొప్పున వచ్చాయి. మొత్తం 5,839 దరఖాస్తుల్లో 2,780 అప్లికేషన్లకు ఆమో దం లభించగా 320 తిరస్కరించారు.

కోనసీమలో 2369

బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 2,369 దరఖాస్తులు వచ్చాయి. అమలాపురం మునిసిపాలిటీలో 437,అముడా 627, మండపేట 844, రామచంద్రపురం 182, ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలో 279 చొప్పున వచ్చాయి. మొత్తం దరఖాస్తుల్లో 983 ఆమోదం పొందగా 89 తిరస్కరణకు గురయ్యాయి. కోనసీమ జిల్లాలో వచ్చిన మొత్తం దరఖాస్తుల ద్వారా రూ.21.45 కోట్లు ప్రభుత్వానికి ఆదాయం సమకూరనుంది.ఉమ్మడి జిల్లా అంతా రూ.127 కోట్లు ఆదాయం సమకూరనుండగా ఇప్పటికే చాలా మంది అపరాధ రుసుములు చెల్లించడం ద్వారా సగానికిపైగానే వచ్చినట్టు అధికారులు పేర్కొన్నారు.



లాలాచెరువులో డీడీవో కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ కీర్తి చేకూరి, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, రుడా చైర్మన్ బీవీఆర్ చౌదరి, డీడీవో వీణాదేవి

పంచాయతీరాజ్‌కు డివిజన్ ఆఫీస్‌లు

కలెక్టర్ కీర్తి చేకూరి

దివాన్‌చెరువు, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి) : పంచాయితీరాజ్ వ్యవస్థ కార్యకలాపాలను సమర్థవంతంగా పర్యవేక్షించేందుకు డివిజనల్ అభివృద్ధి అధికారి (డీడీవో) కార్యాలయాలు ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. జిల్లాలో రాజమహేంద్రవరం, కొవ్వూరు డివిజన్ పరిధుల్లో గురువారం డీడీవో కార్యాలయాలు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వర్చువల్‌గా ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ లాలాచెరువు హౌసింగ్‌బోర్డు కాలనీలో రాజమహేంద్రవరం డివిజనల్ అభివృద్ధి అధికారి కార్యాలయాన్ని ఏర్పాటు చేశామన్నారు. రెవెన్యూ వ్యవస్థలో ఆర్డీవో విధానం ఉన్నట్టుగా పంచాయతీ రాజ్ వ్యవస్థ బలోపేతానికి ఈ డివిజనల్ అభివృద్ధి అధికారి వ్యవస్థ ప్రవేశపెట్టారని చెప్పారు. డివిజనల్ గ్రామ పంచాయతీ అధికారి, డీడీవో ఉపాధి హామీ పథకం(నరేగా) అధికారులు ఒకో చోట నుంచి పనిచేయడం ద్వారా పరిపాలనలో వేగం,జవాబుదారీతనం పెరుగుతుందన్నారు. ఇప్పటి వరకూ అభివృద్ధి పనుల నిమిత్తం మండలస్థాయిలో ఎంపీడీవోను సంప్రదించేవారని ఇకపై డివిజనల్ స్థాయిలోనూ సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ ఉపాధి హామీ పనులను పర్యవేక్షించడానికి ఈ వ్యవస్థ దోహదపడుతుందన్నారు. గ్రామ సచివాలయాల పనితీరును విశ్లేషించి లోపాలను తక్షణమే పరిష్కరించే విధంగా ఈ కార్యాలయాలు పనిచేస్తాయని చెప్పారు. అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ చాలాకాలం తరువాత పంచాయితీరాజ్ పరిపాలనలో క్రమబద్ధీకరణ సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, డీపీవో వి.శాంతమణి, డీడీవో పి.వీణాదేవి, డీఎల్‌పీవో ఎం.నాగలత, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బి.వి.రెడ్డి, డీఈ శ్రీనివాస్, డీఆర్‌డీఏ పీడీ ఎన్వీవీఎస్.మూర్తి, డ్వామా పీడీ నాగమహేశ్వరరావు, సమగ్రశిక్ష పీవో ఎస్.సుభాషిణి , హౌసింగ్ పీడీ నాతి బుజ్జి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అవినాష్, ఎంపీడీవో జె.రఘూన్సీ, తహశీల్దార్ దేవి పాల్గొన్నారు.

కొవ్వూరులో ఏర్పాటు

కొవ్వూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేసి ప్రజలకు పరిపాలన అందుబాటులో ఉండే విధంగా డిప్యూటీ సీఎం కొణిదల పవన్‌కల్యాణ్ చర్యలు తీసుకుంటున్నారని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు డీడీవో కార్యాలయాన్ని గురువారం ప్రారంభించి మాట్లాడారు.రూ. 19 లక్షలతో డీడీవో కార్యాలయాన్ని ఆధునీకరించామన్నారు.కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, మద్దిపట్ల శివరామకృష్ణ, ఏఎంసీ చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్, ఎంపీపీ కాకర్ల నారాయుడు, సూరపనేని చిన్ని, డీఎల్‌డీవో ఎ.స్లీవారెడ్డి పాల్గొన్నారు.

నైపుణ్యం, భాషపై పట్టు ఉంటే
విదేశాల్లో ఉపాధి
న్యాక్ అదనపు డైరెక్టర్ మనోహర్

ధవళేశ్వరం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నైపుణ్యం, భాషపై పరిజ్ఞాన కల వారికి విదేశాల్లో ఉపాధికి కొదువ లేదని ఏపీఎస్‌డీసీ జీఎం, న్యాక్ అదనపు డైరెక్టర్ జనరల్ మనోహర్ అన్నారు. ఐటీఐ ఎలక్ట్రీషియన్ పూర్తి చేసిన విద్యార్థులకు విదేశాల్లో ఉపాధి అవకాశాలు మెరుగు పరచడానికి ఏపీఎస్ఎస్‌డీసీ, ఓఎంక్యాప్, న్యాక్ సంయుక్త ఆధ్వర్యంలో బొమ్మూరు కలెక్టరేట్‌లో ఉన్న న్యాక్ భవనంలో గురువారం జర్మన్ భాషపై శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. శిక్షణకు 30 మంది విద్యార్థుల ఎంపికయ్యారని తెలిపారు. జర్మన్ భాషను పట్టుదలగా నేర్చుకోవాలన్నారు. ఎంత బాగా నేర్చుకుంటే అంత ఉపాధి లభిస్తుందన్నారు. జర్మనీలో ఎలక్ట్రీషియన్ల కొరత ఉందన్నారు. ఇండో యూరో సింక్రినైజేషన్ ఎండీ వి. శ్రీరాజ్,హేమా చౌదరి మాట్లాడుతూ జర్మనీలో అందుబాటులో ఉన్న ఉపాధి మార్గాలు, వృత్తి నైపుణ్యం ఉన్న వారికి అవకాశాలు వివరించారు. ప్రతి ఒక్కరూ తమ ప్రతిభను మెరుగు పరుచుకోవాలాన్నారు. వృత్తిలో నైపుణ్యత ఉంటే అవకాశాలు వాటంతటవే వస్తాయన్నారు. యువత వృత్తి నైపుణ్యత సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాక్ డిప్యూటీ డైరెక్టర్ మురళి, జె.రాజు, న్యాక్ సిబ్బంది,శిక్షణకు హాజరై విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పొగాకు రైతుల ప్రయోజనాలు కాపాడాలి
పార్లమెంట్‌లో ఎంపీ పురందేశ్వరి

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పొగాకు పంటపై సుమారు 2 కోట్ల మంది రైతు కూలీలు, 60 లక్షల మందికి పైగా రైతులు ఆధారపడి ఉన్నారని, పన్నుల్లో మార్పులు చేసేసమయంలో వారి ప్రయోజనాలను తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకోవాలని రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి కోరారు. పార్లమెంట్‌లో పొగాకు, సంబంధిత ఉత్పత్తులపై జరిగిన చర్చలో గురువారం ఆమె పాల్గొని మాట్లాడారు. పొగాకు ఉత్పత్తులపై పన్నులు విధించే సమయంలో ఆ పంట సాగుపై ఆధారపడిన రైతులు, రైతు కూలీల జీవనోపాధిపై పడే ప్రభావాన్ని కూడా కేంద్రం దృష్టిలో పెట్టుకోవాలని సూచించారు. అలాగే, పొగాకు రైతులను వైవిధ్యమైన పంటల సాగు వైపు ప్రోత్సహించే చర్యలు చేపట్టాలని ఆమె కోరారు.

జిల్లాకు మరో ఫైర్‌స్టేషన్
నేడు ఎమ్మెల్యే గోరంట్ల శంకుస్థాపన

రాజమహేంద్రవరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం రూరల్‌లో నూతనంగా రూ.2.25 కోట్లతో నిర్మించే అగ్నిమాపక కేంద్రానికి శుక్రవారం ఉదయం 10.10గంటలకు రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి శంకుస్థాపన చేస్తారని జిల్లా ఫైర్ అధికారి మార్టిన్ లూథర్ కింగ్ తెలిపారు. రాజమహేంద్రవరం రూరల్ పరిధిలో ఫైర్ సర్వీసు సేవలకు వెసులుబాటు కలుగుతుందన్నారు.

నేడే బడి పండుగ

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు పూలు, మామిడి తోరణాలతో అలంకరించుకున్నాయి. పిల్లల బంగారు భవితకు బాటలు వేసే దిశగా పెద్దల సూచనలు స్వీకరించడానికి

1574 పాఠశాలల్లో ప్రత్యేక ఏర్పాట్లు

ఈ ఏడాది 'మెగా పేరెంట్ టీచర్ మీటింగ్'కి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. జిల్లాలో 988 ప్రభుత్వ, 586 ప్రైవేటు పాఠశాలల్లోని 2,37,754 మంది విద్యార్థులు వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అధికారులు, ఆ ప్రాంతంలోని ప్రజా ప్రతినిధులు తదితరులు కలిపి సుమారు 5 లక్షల మంది వేడుకలకు హాజరుకానున్నారు. పిల్లల బంగారు భవితకు బడి వైపు ఒక్క అడుగు ముందుకు అనే నినాదంతో భారీ కార్యక్రమానికి పాఠశాలలను సిద్ధం చేశారు. ఇప్పటికే ఆయా పాఠశాలల ప్రధానో పాధ్యా యులు, ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు/సంరక్షకులకు బడి పండుగకు రావాలంటూ ఆహ్వానం పలికారు.కార్యక్రమ నిర్వహణపై ఇప్పటికే కలెక్టర్ కీర్తి చేకూరి సమీక్ష చేసి స్పష్టమైన ఆదేశాలిచ్చారు. హోలి స్టిక్ ప్రోగ్రెస్ కార్డుల పంపిణీ, విద్యార్థుల ప్రదర్శనలు, వ్యక్తిగత అంచనాలు, విద్యార్థుల ఆరోగ్యంపై చర్చ వంటి వాటితో పాఠశాల, సమాజం అనుసంధానాన్ని బలోపేతం చేసే విధంగా కార్యక్రమాలను రూపొందించారు. పూర్వ విద్యార్థులను భాగస్వాములను చేశారు.

కార్యక్రమం సాగుతుందిలా..

శుక్రవారం ఉదయం 9నుంచి 9.30 గంటల వరకూ స్వాగత కార్యక్రమం, తరగతి గదుల్లో కూర్చో వడం ఉంటుంది. 9.30 నుంచి 10.30 గంటల వరకూ హెచ్‌పీసీపై తల్లిదండ్రులతో టీచర్ల చర్చ, అసెస్ పుస్తకాలపై వివరణ, లీప్ యాప్, కెరీర్ గైడెన్స్, మానసిక ఆరోగ్యం, నైపుణ్య విద్య, పిల్లల పట్ల ప్రవర్తించకూడని తీరు, బాలికల విద్య విశిష్టత, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, పిల్లల పట్ల పెద్దల సానుకూల దృక్పథం వంటి వాటిపై వీడియోల ప్రదర్శన, 10.50 నుంచి 11గంటల వరకూ స్పోర్ట్స్ కిట్లు, లైబ్రరీ పుస్త కాలు, ఏటీఎల్/స్టెమ్ ల్యాబ్స్, పిల్లలు తయారు చేసిన క్రాఫ్ట్స్, సైన్స్ ప్రాజెక్టులను తల్లిదండ్రులు చూస్తారు. 11నుంచి 12.45 గంటల వరకూ పాఠశాల, అకడమిక్ ప్రోగ్రెస్, బాలికల చేత సెల్ఫ్ డిఫెన్స్ ప్రదర్శన, టీచర్లు, ప్రజాప్ర తినిధులు, తల్లిదండ్రుల సందేశాలు ఉంటాయి. 12.45 గంటలకు అందరూ కలిసి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలోని భోజ నం చేశాక ఇళ్లకు వెళతారు. ఈ మేరకు ఇప్పటికే ప్రభుత్వం నిధులు విడుదల చేసింది.

పీటీఎంకు 5 లక్షల మంది హాజరవుతారని అంచనా

విద్యార్థుల చదువు అటకెక్కింది. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత రేపటి పౌరుల బంగారు భవిత కోసం అక్షరం ముఖ్యమని విద్యారంగాన్ని గాడిలో పెట్టే పని మొదలు పెట్టింది. విద్యా మంత్రిగా పగ్గాలు చేపట్టిన నాటి నుంచే విద్యారంగాన్ని నారా లోకేశ్ గాడిలో పెట్టడంపై ప్రత్యేక దృష్టి సారించారు. ఆ మేరకు ప్రతి పాఠశాలలోని ప్రతి విద్యార్థిపై దృష్టి సారించారు. విద్యార్థి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు/సంరక్షకులు కూర్చుని విద్యార్థి భవిష్యత్తు, బడి అభివృద్ధే లక్ష్యంగా చర్చిస్తారు.

నాడు అలా - నేడు ఇలా

గత వైసీపీ ప్రభుత్వంలో అటు ఉపాధ్యాయులకు బోధనకు సమయం లేకపోగా.. ఇటు

అందరూ హాజరుకావాలి...

ఇదొక అద్భుతమైన ఆత్మీక కలయిక. అన్ని ఏర్పాట్లూ చేశాం. పిల్లల బంగారు భవితకు, విద్యాలయ అభివృద్ధికి స్నేహపూర్వక వాతావరణంలో చర్చ జరుగుతుంది. ఇప్పటికే సన్నద్ధత కార్యక్రమాలు చేయించాం. పీటీఎంకి వచ్చే వారందరికీ భోజన ఏర్పాట్లు చేశాం. ఇప్పటికే ఆహ్వానాలు వెళ్లాయి.ఆత్మీయ కలయికకు అందరూ హాజరుకావాలని కోరుతున్నాం.

- కె.వాసుదేవరావు, డీఈవో

పది విద్యార్థులు పట్టుదలగా చదవండి : డీఈవో



కొవ్వూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పదవతరగతి విద్యార్థులు పట్టుదలతో చదవి, మంచిమార్కులతో ఉత్తీర్ణత సాధించాలని డీఈవో కె.వాసుదేవరావు అన్నారు. కొవ్వూరు మండలం పంగిడి పీఎంప ఉన్నత పాఠశాలను గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. పది విద్యార్థులకు దిశ, నిర్దేశం చేశారు. 100 రోజుల ప్రణాళికలో విద్యార్థు లు ఏకాగ్రతతో చదవాలన్నారు. పీఎంశ్రీ పాఠశాల అభివృద్ధి పనులకు నిధుల కొరత లేదన్నారు. పాఠశాల విద్యార్థులకు ఐడీ కార్డులు పంపిణీ చేశారు.కార్యక్రమంలో ఎస్ఎస్ఏ అధికారి గౌరీశంకర్, చీఫ్ మానిటరింగ్ అధికారి శ్రీనివాసరావు, హెచ్ఎం మంగెన శ్రీరామారావు, టీచర్లు పరమేశ్వరశాస్త్రి, మధులత, ధనరాజు, అరుణకుమారి,రవికుమార్, కృష్ణవేణి, నాగేంద్ర, అచ్చయ్య, మురళీ పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్ట్ ఎన్‌క్లేవ్ స్థలం పరిశీలన

కోరుకొండ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎయిర్ పోర్ట్ ఎన్‌క్లేవ్ స్థలాన్ని గురువారం ఆర్‌డీవో ఆర్.కృష్ణ నాయక్, విశాఖ సబ్ డివిజనల్ ఆఫీసర్,ఎయిర్ పోర్ట్ అధికారులతో కలిసి సంయుక్తంగా పరిశీలించారు. కోరుకొండ మండలం బూరుగుపూడిలో సర్వే నెంబర్లు 403, 366, ఎల్‌పీఎం నెంబర్లు 1502 మొదలైన వాటిలో ప్రతిపాదించిన ఎన్‌క్లేవ్ స్థలం ఉందన్నారు.వారి వెంట కోరుకొండ తహశీల్దార్ సుస్వాగతం, సర్వేయర్లు పాల్గొన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డీవో కృష్ణ నాయక్

ఇకపై ఫిజియోథెరపీ కోర్సుకు నీట్

6



సీఎంతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముప్పిడి

2027 పుష్కరాలకు నిధులివ్వండి
సీఎంకు ఎమ్మెల్యే ముప్పిడి వినతి

కొవ్వూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రానున్న 2027 గోదావరి పుష్కరాలకు కొవ్వూరు నియోజకవర్గానికి నిధులు మంజూరు చేయాలని సీఎం నారా చంద్రబాబు నాయుడిని కోరినట్టు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తెలిపారు. రాజధాని అమరావతిలో గురువారం సీఎం చంద్రబాబును కలిసి శాఖలవారీగా తయారుచేసిన ప్రతిపాదనలను అందజేశారు. పంచాయతీరాజ్ శాఖ ద్వారా రూ.4159 లక్షలు, ఎండోమెంట్ ఆధ్వర్యంలో దేవాలయాల పునరుద్ధరణకు రూ.22 కోట్లు, టూరిజంకు రూ. 34 కోట్ల ప్రతిపాదనలను సీఎంకు అందించామన్నారు. అనంతరం సీఎంవో కార్యాలయంలో మునిసిపల్‌శాఖ మంత్రి పి.నారాయణను కలిసి కొవ్వూరు మునిసిపాలిటీని గ్రేడ్ 1 మునిసిపాలిటీగా అప్‌గ్రేడ్ చేయాలని కోరామన్నారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి అక్కడే ఉన్న ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్‌కుమార్‌ను మునిసిపాలిటీ అప్‌గ్రేడ్‌కు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారన్నారు. సీఎస్ ప్రతిపాదనలు సమర్పించాలని మునిసిపల్ కమిషనర్‌కు ఫోన్ చేసి ఆదేశించారని చెప్పారు.



పంట పొలాల మధ్యలో అడుగుపెడితే పచ్చదనం కనువిందు చేస్తుంది. పక్షుల కిల కిలరావాలు... పండ్ల వాసనలు, ఆకుల చప్పుళ్లు... ఇవన్నీ కలగలిసిన ఆ మాయ జాలం పేరు ప్రకృతి నిలయం. డాక్టర్‌బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలేనికి చెందిన చిన్నం తేజారెడ్డి కేతారాజుపల్లిలో సృష్టించిన ప్రకృతి సీమ 12 ఎకరాల్లో విస్తరించి ఉంది. ఇక్కడి అతిథి గృహం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. సరదా కోసం ప్రారంభమైన ఈ పచ్చదన యజ్ఞం ప్రకృతి ప్రేమికులకు ప్రేరణగా నిలుస్తోంది.



- జీవ వైవిధ్యానికి నిలువెత్తు దర్పణం
- పంట పొలాల మధ్య పచ్చదనం
- రావులపాలెం మండలం కేతరాజుపల్లిలో చిన్నం తేజారెడ్డి స్ఫూర్తి కేంద్రం
- 12 ఎకరాల్లో 300 రకాల మొక్కల పెంపకం... గిరిజా కోళ్లు, బాతులు, ఆవులు కూడా...

ప్రకృతి నిలయం

(రావులపాలెం-ఆంధ్రజ్యోతి)

ఇక్కడ మొత్తం 300 రకాల మొక్కలను పెంచుతున్నారు. 30 రకాల మామిడి చెట్లు, 50 రకాల పండ్ల మొక్కలు ఉన్నాయి. ఇవికాక ఇతర జాతులకు చెందిన మొక్కలూ ఉన్నాయి. తైవాన్ జామ, దేశవాళీ జామ, రెడ్ పనస, వేప మామిడి, డ్రాగన్‌ఫ్రూట్, అవకాడో, పాల సపోటా, బత్తాయి, ఉసిరి, మారేడు, తామర పుష్పాలు, మల్బరీ, రేగు, జీడిగింజలు, యాపిల్, సపోటా... ఇలా అనేక రకాలు కనువిందు చేస్తున్నాయి. ఎటువంటి రసాయనాలను వినియోగించకుండా పూర్తి ఆర్గానిక్ పద్ధతిలో పర్యావరణానికి మేలు చేసే విధంగా సహజ ఎరువులతో సాగు చేస్తున్నట్టు తేజారెడ్డి 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు.



సేంద్రియ పద్ధతిలో బంతి పూల సాగు





ప్రకృతి నిలయంలో కోళ్లు, బాతులు, వివిధ రకాల పక్షులు, ఆవు దూడ

కాగా ప్రకృతి నిలయంలో పక్షుల కిలకిలరావాలు ఎప్పుడూ వినిపిస్తూనే ఉంటాయి. గిరిజా కోళ్లు, నాటుకోళ్లు, ఫ్యాన్సీ కోళ్లు, బాతులు, చిన్న ఆవులు, పుంగనూరు ఆవులు, కపిల ఆవులను కూడా ఇక్కడ పెంచుతున్నారు. పక్షుల కిలకిలలు, పండ్లవాసన మధ్య ప్రకృతిని ఆస్వాదించే వారికి ఇది ఒక స్వర్గధామం అని చెప్పవచ్చు. ఇక్కడ కాసిన పండ్లను పక్షులకే పెట్టడం తప్ప ఎటువంటి క్రయవిక్రయాలు జరపకపోవడం విశేషం.



బిలిమ్స్ ఫ్రూట్ మొక్క



రెడ్ పనస



తెనెటీగల పెంపకం తొట్టెలు



ప్రతిక్షణం ప్రశాంతం

పండ్ల తోటల మధ్య గడిపిన ప్రతి క్షణం మనసుకు ఎంతో ప్రశాంతంగా ఉంటుంది. ప్రకృతిపై ఉన్న మమకారంతో సుమారు పదేళ్లుగా మొక్కలను పెంచుతున్నాను. పక్షులను, జంతువులను కుటుంబ సభ్యుల్లా చూసుకుంటాను. ఈ ప్రకృతి నిలయం ఎందరికో ఆదర్శంగా నిలుస్తోంది. ఇందులో పెరిగే మొక్కలను చూసేందుకు ఇతర ప్రాంతాల నుంచి తరలివస్తున్నారు.

చిన్నం తేజారెడ్డి, రావులపాలెం





ఆరబెట్టి... బండెనక బండి కట్టి...

దిత్వా తుఫాను ప్రభావంతో ఐదు రోజులుగా ఉన్న ముసురు వాతావరణం వీడింది. కాకినాడ జిల్లా పిఠాపురం, గొల్లప్రోలు ప్రాంతాల్లో ఎండ కాయడంతో వర్షానికి తడిసిన ధాన్యం రాశులను ఒకవైపు ఆరబెడుతూ, మరోవైపు ఆరిన ధాన్యాన్ని బస్తాల్లోకి నింపి ఎప్పటికప్పుడు ఎడ్ల బండ్లపై మిల్లులకు తరలిస్తున్నారు రైతులు. మరలా వాతావరణం మారినా ఇబ్బంది లేకుండా ఉండేందుకు ఇలా ఏర్పాటు చేసుకోవడంతో రహదారులపై ఎడ్లబండ్ల సందడి అధికంగా ఉంది. గురువారం ధాన్యం ఆరబెట్టి, బండెనక బండి కట్టి అనే రీతిలో తరలిస్తున్న దృశ్యాలను 'ఆంధ్రజ్యోతి' క్లిక్‌మనిపించింది.

- గొల్లప్రోలు/పిఠాపురం(ఆంధ్రజ్యోతి)



ఎడ్ల బండ్లపై ధాన్యం బస్తాలు వేసి మిల్లులకు తరలిస్తున్న దృశ్యం



మహా సంస్థానంలో శ్రీపాదశ్రీవల్లభుడు, దత్తాత్రేయుడు, నృసింహ సరస్వతిలకు పూలంగి సేవ

జై గురుదేవ దత్త

పిఠాపురం పాదగయ, శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానంల్లో ఘనంగా దత్తాత్రేయ స్వామి జయంతి

పిఠాపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం పాదగయ క్షేత్రంలో వేంచేసియున్న స్వయంభూ దత్తాత్రేయస్వామి సన్నిధిలో దత్త జయంతి గురువారం వైభవంగా జరిగింది. సప్తాహ మహోత్సవాల్లో చివరి రోజున దత్తాత్రేయునికి మహన్యాసపూర్వక శత రుద్రాభిషేకం నిర్వహించారు. సర్వ పుష్పార్చన, దతమూలమంత్రాలతో హోమం, పూర్ణాహుతి, అవబృదం జరిగాయి. సాయంత్రం స్వామికి ప్రత్యేక ఊయల సేవ జరిపారు. భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి ఔదుంబర వృక్షం వద్ద, శ్రీపాదశ్రీవల్లభునికి పూజలు జరిపారు. గురుచరిత్ర పారాయణ, పూలంగి సేవ నిర్వహించారు. దత్తమాల ధరించిన భక్తులు ఇరుముడి సమర్పించారు. పాదగయ పుష్కరిణిలో దత్తాత్రేయుని తెప్పోత్సవం ఘనంగా జరిగింది. హంస వాహనంపై స్వామి విహరించారు. ఈవో కాట్నం జగన్మోహనశ్రీనివాస్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానంలో ఉదయం మహా గణపతి పూజ, కలశస్థాపన, శ్రీపాదశ్రీవల్లభుల మహిమాన్విత దివ్య పాద పద్మాలకు మహన్యాసపూర్వక ఏకాదశ శతరుద్రాభిషేకం, శ్రీసూక్త, పురుష సూక్తాలతో సహస్ర నామార్చన, మంగళహారతి, మంత్రపుష్పం, వేదపారాయణ, రుత్వికులచే మూలమంత్ర అనుష్టానం, గణపతి అధర్వశీర్ష ఉపనిషత్ పారాయణ, గురుచరిత్ర, శ్రీపాదశ్రీవల్లభ చరితామృత పారాయణ జరిగాయి. దత్త మంత్ర హోమం అనంతరం పూర్ణాహుతి నిర్వహించారు. స్వాములకు వివిధ హారతులు, సాయంకాలార్చన జరిగాయి. రాత్రి దత్తాత్రేయస్వామి రథోత్సవం కనుల పండువగా జరిగింది. శ్రీపాద శ్రీవల్లభులు, దత్తాత్రేయస్వామి, నృసింహ సరస్వతులకు పూలంగి సేవ, బిల్వార్చన నిర్వహించి విశేషంగా అలంకరించారు. మహారాష్ట్ర, కర్ణాటక, ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు ఉత్తరాది భక్తులు అధికంగా తరలివచ్చారు. దర్శనానికి కిలోమీటరు పొడవునా బారులు తీరారు. అన్నప్రసాద వితరణ జరిగింది. ఈవో సౌజన్య ఏర్పాట్లను పర్యవేక్షించారు.



పాదగయలో స్వయంభూ దత్తాత్రేయస్వామికి నక్షత్ర హారతి ఇస్తున్న అర్చకుడు



శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానంలో రథోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఈవో సౌజన్య



పాదగయలో ఇరుముడి సమర్పిస్తున్న దత్తస్వాములు



పాదగయ పుష్కరిణిలో దత్తాత్రేయ స్వామికి తెప్పోత్సవం

ఇకపై ఫిజియోథెరపీ కోర్సుకు నీట్

- దేశమంతా ఒకే సిలబస్
- వ్యవధి ఐదేళ్లకు పెంపు
- ఏపీఎస్‌పీ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ సురేష్‌బాబు రెడ్డి



సర్టిఫికెట్లు అందిస్తున్న జీఎస్ఎస్ చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు

రాజానగరం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఫిజియోథెరఫీ కోర్సులో ప్రవేశానికి 2026-27 సంవత్సరం నుంచి తప్పనిసరిగా నీట్ పరీక్షల్లో అర్హత సాధించాలని అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ ఫిజియోథెరపిస్ట్స్(ఏపీఎస్‌పీ)వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎం.సురేష్‌బాబురెడ్డి వెల్లడించారు. రాజానగరం సమీపంలోని జీఎస్ఎల్ ఫిజియోథెరపీ కాలేజీల గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమానికి ఆయన విచ్చేసి మాట్లాడారు. ఈ కోర్సుకు దేశమంతా ఇకపై ఒకే సిలబస్ ఉంటుందని, ఒకే రెగ్యులేటరీ సంస్థ ఏర్పాటవుతుందన్నారు. ఇప్పటి నాలుగేళ్ల ఫిజియోథెరపీ కోర్సు వ్యవధి ఐదేళ్లు పెరిగిందన్నారు. మందులు వాడకుండా కేవలం చేతులతో పేషెంట్లకు నొప్పి తొలగించే హీలింగ్ హ్యాండ్ ఫిజియోథెరపీ, జనరల్ ఫిజియోథెరపిస్టులు స్పెషలైజ్డ్ ఫిజియోథెరపిస్టులుగా నైపుణ్యాలను పెంచుకోవాలన్నారు. జీఎస్ఎల్ ఫిజియోథెరపీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు మాట్లాడుతూ తమ కళాశాల ఇంటర్న్‌షిప్ విద్యార్థులు ఏడాది కాలంలో 12,390 మంది రోగులకు చికిత్స అందించారని, తెలుగు రాష్ట్రాల్లో ఇదే రికార్డని చెప్పారు. రాష్ట్రంలో ఫిజియోథెరిపీలో పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌ను అందిస్తున్న ఏకైక సంస్థ జీఎస్ఎల్ అని అన్నారు. డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీ నిర్వహించిన ఎంపీటీ పరీక్షల్లో యూనివర్శిటీ స్థాయిలోని మొదటి మూడు ర్యాంకులు తమ విద్యార్థులే కైవశం చేరుకోవడం అరుదైన రికార్డుగా పేర్కొన్నారు. కార్యక్రమంలో జీఎస్ఎల్ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఎస్ గురునాథం, సూపరింటెండెంట్ డాక్టర్ టీవీఎస్‌పీ మూర్తి, జీఎస్ఎల్ స్వతంత్ర ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ వేణుగోపాల్ తదితరులు పాల్గొని మాట్లాడారు.


పోలవరం ఎల్ఎంసీతో అనకాపల్లికి గోదావరి జలాలు

రాజమహేంద్రవరం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): వచ్చే పంట సీజన్ నాటికి పోలవరం ఎల్ఎంసీ ద్వారా అనకాపల్లి వరకూ గోదావరి జలాలను సరఫరా చేస్తామని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. గురువారం పోలవరం ప్రాజెక్టు పనులను పరిశీలించిన తర్వాత పనుల ప్రగతిపై ఆయన సమీక్షించారు. పుష్కరాల కంటే ముందుగానే పోలవరం ప్రాజెక్టు పూర్తి చేస్తామన్నారు. ఇప్పటికే 88శాతం పనులు పూర్తయ్యాయని, రూ.600 కోట్లతో ఎడమ ప్రధాన కాలువ పనులు జరుగుతున్నాయన్నారు.వచ్చే ఏడాది డిసెంబరు నాటికి పోలవరం నిర్వాసితులకు పూర్తిగా పరిహారం చెల్లించి, కాలనీల నిర్మాణం పూర్తి చేసే లక్ష్యంతో ముందుకు వెళుతున్నట్టు చెప్పారు. సమావేశంలో ఇరిగేషన్ సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, ఆర్ అండ్ఆర్ కమిషనర్ పి.ప్రశాంతి తదితర అధికారులు పాల్గొన్నారు.

ఏఐ టూల్‌తో విద్యార్థుల సమగ్ర నివేదిక

ఫిజిక్స్ ఉపాధ్యాయుడి ఆలోచన.. మెగా పీటీఎం సందర్భంగా నేడు ఆవిష్కరణ

కరప, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)ను ఉపయోగించి విద్యార్థుల సమగ్ర నివేదికను వారి తల్లిదండ్రుల కళ్లకు కట్టినట్టుగా చూపించగలిగితే ఎలా ఉంటుందనే ఆ మాస్టారి ఆలోచన అందరి మన్ననలు అందుకుంటోంది. కాకినాడ జిల్లా కరప మండలం గురజనాపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో వీవీ రమణమూర్తి ఫిజిక్స్ టీచర్‌గా పనిచేస్తున్నారు. విద్యార్థులందరి మార్కులు, హాజరు, ఇతర డేటాను గూగుల్ జెమిని అప్లికేషన్‌కు అనుసంధానించారు. ఆ డిజిటల్ ప్లాట్‌ఫామ్‌పై విద్యార్థి పేరు టైప్ చేయగానే విద్యార్థి ప్రగతికి సంబంధించిన సమస్త సమాచారం టెక్స్ట్ రూపంలో ప్రత్యక్షమవుతుంది. అప్పటి వరకు జరిగిన పరీక్షల్లో సబ్జెక్టుల వారీ మార్కులు, వెనుకబాటుకు గల కారణాలు, సరిదిద్దుకోవాల్సిన అంశాలు, మెరుగుపరుచుకోవడానికి అవసరమైన సూచనలు, ఇలా అన్ని కోణాల్లో సమగ్ర నివేదికను అందజేస్తుంది. ఈ ఏఐ టూల్‌ను శుక్రవారం మెగా పేరెంట్స్ మీటింగ్ సందర్భంగా ఆవిష్కరించనున్నట్టు రమణమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను హెచ్ఎం అళ్ల సాయిమోహన్, ఎస్ఎంసీ చైర్మన్ నూకరాజు,సర్పంచ్ శ్రీనివాస్, స్టాఫ్ సెక్రటరీ ఐ.ప్రసాదరావు తదితరులు అభినందించారు.



ఏఐ ఇచ్చిన ఒక విద్యార్థి సమగ్ర నివేదిక, ఉపాధ్యాయుడు రమణమూర్తి

హాకీ పోటీల్లో విజేతలకు కలెక్టర్ అభినందన

కలెక్టరేట్ (కాకినాడ), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి హాకీ పోటీల్లో మహిళల విభాగంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా తరపున హాకీ క్రీడలలో పాల్గొని రాష్ట్రస్థాయిలో కాకినాడ పీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినులు ప్రథమ స్థానం సాధించారు. అలాగే పీఆర్ జూనియర్ కళాశాల విద్యార్థులు బాలుర విభాగంలో హాకీ క్రీడల్లో రాష్ట్ర స్థాయిలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా తరపున పాల్గొని ద్వితీయస్థానం సాధించారు. ఈ సందర్భంగా కాకినాడ కలెక్టరేట్‌లో కలెక్టర్ షాన్‌మోహన్ గురువారం వీర్ని ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో మరెన్నీ పోటీల్లో గెలుపొందాలని ఆకాంక్షించారు. జిమ్నాస్టిక్స్‌లో కె.శివగణేశ్ పాల్గొని ఆరు బంగారు పతకాలు, ఒక వెండి పతకం సాధించారు. వెయిట్ లిఫ్టింగ్‌లో నలుగురు విద్యార్థులు బంగారు పతకాలు,ఒక విద్యార్థి వెండి పతకం సాధించారు. కార్యక్రమంలో ఇంటర్మీడియట్ డీఈవీవో శారద, ప్రిన్సిపల్ రాంబాబు, పీడీ రత్నసామ్యూల్, అధ్యాపకులు వర్మ, ప్రేమ్‌కుమారి, శశికళ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కోసం ఎడారి దేశానికి.. హింసకు గురై ఇంటికి

- పేషెంటును చూసుకోవాలని తీసుకెళ్లి గొడ్డు చాకిరీకి పనిలో పెట్టిన వైనం
- తెలుగు ఏజెంట్ల దాష్టీకం
- 2 నెలలు తీవ్రంగా ప్రయత్నించిన భర్త
- పోలీసులు, లోకేశ్ ఆఫీస్ సిబ్బంది నిర్లక్ష్యం
- గత నెల 29న ఇంటికి చేరిన మహిళ

రాజమహేంద్రవరం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఉపాధి కోసం ఎడారి దేశాల దారి పడుతున్న మహిళలు మోసకారి ఏజెంట్ల మాటల వలలో పడి పనిలో చేరిన తర్వాత పడరాని పాట్లు పడుతున్నారు. ఆ బాధను అధికారులు కూడా పట్టించుకోకపోవడం మరింత ఆవేదనకు గురిచేస్తోంది. తూర్పుగోదావరి జిల్లా చాగల్లు మండలానికి చెందిన ఎస్‌కేఎస్.బీబీ వ్యథ అటువంటిదే. ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో 8 నెలల కిందట పాలకొల్లుకు చెందిన నాగరాజు అనే ఏజెంట్ ద్వారా బీబీ మస్కట్ వెళ్లింది. అక్కడ ఒక పేషెంటును మాత్రమే చూసుకోవాలని చెప్పారు.అక్కడకు వెళ్లాక రాజమహేంద్రవరానికి చెందిన ప్రియ అనే ఏజెంటు ఆఫీసు ద్వారా ఒక ఇంట్లో పనికి చేరింది. అయితే నాగరాజు చెప్పిన పని కాకుండా.. రోజూ 14 మందికి మూడు పూటలా వండి పెట్టడం, వాళ్ల దుస్తులు ఉతకడం, మూడు అంతస్తుల భవనాన్ని శుభ్రం చేయడం వంటి పనులు అప్పగించారు. దీంతో కొద్ది రోజులకే ఆమెకు నరకం కనిపించింది. అయినా ఉదయం 4గంటల నుంచి రాత్రి 12 గంటల వరకూ గొడ్డు చాకిరీ చేయాల్సి వచ్చేది. ఇదంతా భర్తకు చెప్పినా కొద్ది రోజుల తర్వాత సర్దుకుంటుందని అనుకున్నారు. కానీ పరిస్థితి రోజురోజుకూ ఇబ్బందిగా మారడంతో రెండు నెలల కిందట ఆమెను ఇక్కడికి తీసుకొచ్చే ప్రయత్నాలు ఆరంభించారు. తొలుత చాగల్లు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పట్టించుకోలేదు. తర్వాత కలెక్టర్ గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చారు. అక్కడ నుంచి మంత్రి లోకేశ్ కార్యాలయానికి సమాచారం వెళ్లడంతో..ఆ సిబ్బంది ఆమె భర్తకు ఫోన్ చేసి ఏజెంటు ఫోన్‌కి లైన్ కలిపాడు. ఆమెను ఇండియాకు పంపాలంటే రూ.1.5 లక్షలు ఇవ్వాలని ఏజెంటు డిమాండ్ చేశాడు.అంత ఇచ్చుకోలేనని తనకు పరిచయం ఉన్న వారి ద్వారా భర్త ప్రయత్నాలు చేయడంతో మస్కట్‌లోని భారత రాయబార కార్యాలయం రంగంలోకి దిగింది. దీంతో ఆమెను పంపడానికి గత నెల 28న విమానం టికెట్ కొన్నారు. అంతకు 4 రోజుల ముందు మస్కట్‌లోని ఏజెంట్ ప్రియ కార్యాలయానికి బీబీని తీసుకెళ్లి శారీరకంగా హింసించినట్టు ఆమె వాపోయింది. కొట్టి, బూటు కాలితో తన్ని 2 నెలల జీతం, మరికొంత సొమ్ము.. పిల్లల కోసం కొన్న చాక్లెట్లు, దుస్తులను గుంజుకున్నారని కన్నీటి పర్యంతమైంది. ప్రాణాలతో ఇంటికి వెళితే చాలనుకొని బీబీ ఆ బాధను పంటి బిగువున అదిమి పట్టుకొంది. చివరికి 29వ తేదీ ఉదయం ఇండియాకు చేరుకున్నారు. భర్తతో కలిసి ఆమె గురువారం కలెక్టర్ కీర్తిని కలిశారు.అక్కడ ఇంకా తమ వంటి వాళ్లు 12 మంది వరకూ హింస పడుతున్నారని, వాళ్లను రక్షించాలని బీబీ వేడుకొంది. మస్కట్‌లోని ఏజెంటు ప్రియ, పాలకొల్లుకు చెందిన నాగరాజుపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని విన్నవించింది.తన భార్య ఆరోగ్యం బాగుపడాలని లేదంటే తమ జీవితాలు నాశనమవుతాయని, ఇలా ఎవరూ మోసపోకూడదంటూ.. చివరికి కొంత సొమ్ము ఇచ్చే వరకూ ఆమెను పంపించలేదని.. ప్రాణాలతో ఇంటికి చేరదేమో అని ప్రతి క్షణం నరకం అనుభవించానని భర్త కన్నీళ్లు పెట్టుకున్నాడు.



బంధాన్ని బలపరుద్దాం..

మరో విద్యాపండుగకు పాఠశాలలు ముస్తాబయ్యాయి. శుక్రవారం మెగా పీటీఎం-3.0 సమావేశాల నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. తల్లిదండ్రులకు వారి పిల్లల పురోగతిని తెలియజేయడం. పాఠశాలల కార్యకలాపాల్లో వారిని భాగస్వామ్యం చేయడం లక్ష్యంగా ఇప్పటి వరకూ నిర్వహించిన రెండు సమావేశాలు సత్ఫలితాలు ఇచ్చిన నేపథ్యంలో మూడవ సమావేశం ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

- నేడు మెగా పీటీఎం 3.0
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విస్తృత ఏర్పాట్లు
- తల్లిదండ్రుల దృష్టికి విద్యార్థుల ప్రగతి
- పాఠశాల నిర్వహణపై చర్చ
- ఉపాధ్యాయులు, పేరెంట్స్ మధ్య వన్ టూ వన్ మీటింగ్

తొండంగి/పిఠాపురం, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాఠశాలల నడుమ బంధాన్ని బలపరిచి పాఠశాలలను మరింత అభివృద్ధి చేసే లక్ష్యంతో ఏర్పాటుచేసిన పేరెంట్ టీచర్స్ మీటింగ్ (పీటీఎం) 1, 2లు విజయవంతం కావడంతో మూడో సమావేశాన్ని కూడా పూర్తి విజయవంతం చేసేందుకు ప్రభుత్వం అన్నిచర్యలు చేపట్టింది. నేడు శుక్రవారం మెగా పీటీఎం 3.0ను నిర్వహించేందుకు పాఠశాలలకు మార్గదర్శకాలు జారీ చేసింది. దేశంలోనే తల్లిదండ్రులు ఉపాధ్యాయులు నిర్వహణలో ఆదర్శవంతంగా నిలవడంతోపాటు గిన్నీస్‌రికార్డు సాధించిన నేపథ్యంలో ప్రస్తుతం జరిగే మెగా పీటీఎంలో మరిన్ని కొత్త అంశాలను విద్యాశాఖ జోడించింది. విద్యార్థులకు బోధనలో వినియోగించే ఎఫ్ఎల్ఎన్ కిట్టు, జాదూ పిటారా పెట్టెలోని అభ్యసన సామగ్రితోపాటు ఉన్నత పాఠశాలల్లో సైన్స్, సోషల్ ఇతర అంశాల బోధనకు ఉపయోగించే బోధనా సామగ్రి అంతటితో ప్రదర్శన ఏర్పాటు చేసి వచ్చిన వారికి అవగాహన కల్పిస్తారు. ఈనెల 10వ తేదీన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా మెగా పేరెంట్ టీచర్ పేరెంట్ మీటింగ్‌లు నిర్వహించనున్నారు. అన్ని యాజమాన్యాల్లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాల్లో ఈ సమావేశాల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యాభివృద్ధికి పలు కార్యక్రమాలు నిర్వహిస్తోంది. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పాఠశాలలు, కళాశాలల పనితీరు, విద్యాబోధనలో పలు మార్పులు తీసుకువచ్చారు.

సమావేశాల నిర్వహణ ఇలా..

అన్ని పాఠశాలల్లో జరిగే సమావేశాలను ఏ రీతిలో నిర్వహించాలనే విషయంపై ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ మెగా పీటీఎం 3.0లో ప్రధానంగా విద్యార్థుల ప్రగతిని తల్లిదండ్రులకు వివరిస్తారు. గురువారం ఉదయం 9నుంచి 9.30గంటల వరకూ సమావేశానికి వచ్చే తల్లిదండ్రులు, విద్యావేత్తలు, ప్రముఖులు, అధికారులు, పూర్వ విద్యార్థులను ఆహ్వానించాలి. పేరెంట్స్‌ను వారి పిల్లలుతో కలిసి క్లాస్‌రూమ్‌ల్లో కూర్చునే విధంగా ఏర్పాట్లు చేయాలి.

- ఉదయం 9.30నుంచి 10.50గంటల వరకూ ప్రతి విద్యార్థి తల్లిదండ్రులతో క్లాస్ టీచర్ వ్యక్తిగతంగా సమావేశం కావాలి. ఇందులో ఇప్పటివరకూ జరిగిన సమ్మెటివ్, ఫార్మటివ్ అసెస్‌మెంట్ పరీక్షలకు సంబంధించి సబ్జెక్టుల వారీగా విద్యార్థులు రాసేందుకు ఇచ్చిన అసెస్‌మెంట్ బుక్‌లెట్లు చూపించి వారి ప్రగతిని వివరించాలి. హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డు గురించి తెలియజేయాలి. విద్యార్థి లేదా విద్యార్థినికి సంబంధించిన ప్రతి విషయాన్ని వారితో పంచుకోవాలి. వన్ టూ వన్ సమావేశాలు జరిగే సమయంలో తరగతి గదిలో ఉన్న తల్లిదండ్రులకు లీప్‌యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకునేలా అవగాహన కల్పించాలి. వీడియోలద్వారా తల్లికి వందనం పథకం, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, పాజిటివ్ పేరెంటింగ్ గురించి వివరిస్తారు.
- 10.50 నుంచి 11గంటల వరకూ టీఎల్ఎం ఎగ్జిబిషన్, పాఠశాలలుకు అందించిన క్రీడా పరికరాలు, ఇతర వస్తువులు పరిశీలన, ఉన్నత పాఠశాలలో ల్యాబ్‌లు, విద్యార్థులు తయారు చేసిన ఎగ్జిబిట్స్ పరిశీలన ఉంటుంది.
- 11.10 నుంచి 12.45 గంటల వరకూ పాఠశాల విద్యాప్రగతి గురించి హెచ్ఎం నివేదిక, ప్రతిజ్ఞ, విద్యార్థులచే పద్యాలు, గేయాలు ఆలాపన, తల్లిదండ్రుల ప్రసంగాలు, పాఠశాల అవసరాలు, ఇప్పటి వరకూ దాతలు ద్వారా వచ్చిన విరాళాలు గురించి వివరణ, విద్యార్థుల ప్రశ్నల, జవాబుల ఓపెన్ సెషన్, విలువల విద్య, ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థుల వందరోజుల ప్రణాళిక గురించి వివరణ తదితర అంశాలను నిర్వహించాలి.

విజయవంతానికి కసరత్తు

మెగా పీటీఎం-3.0 కోసం ముందుగానే విద్యా కమిటీ ప్రతినిధులు, ఉపాధ్యాయులు సమావేశమై కార్యాచరణ సిద్ధం చేసుకున్నారు. ఆ రోజు విద్యార్థులందరూ తమకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర కిట్లు ద్వారా అందించిన యూనిఫారమ్, బూట్లు, సాక్సులు, బెల్టులు ధరించి హాజరు కావాలని సూచించారు. "అదేవిధంగా తల్లిదండ్రులకు, ఇతర ప్రముఖులకు వ్యక్తిగతంగా విద్యార్థులు లేదా ఉపాధ్యాయులు ద్వారా ఆహ్వానాలు అందించారు. సామాజిక మాధ్యమాల్లో పాఠశాల గ్రూపుల్లో విస్తృత ప్రచారం సాగిస్తున్నారు. మరోవైపు సమావేశాల నిర్వహణ కోసం విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఆయా పాఠశాలలకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించారు. కనిష్టంగా రూ.900 నుంచి రూ.9,000 వరకూ నిధులు విడుదల చేసినట్లు విద్యాశాఖ వర్గాలు వెల్లడించాయి.

పాఠశాలలు ఇలా

కాకినాడ జిల్లాలో 1,259 ప్రాథమిక పాఠశాలలు ఉండగా, వాటిల్లో 51,256మంది విద్యార్థులు చదువుతుండగా, 104 ప్రాథమికోన్నత పాఠశాలల్లో 14,319మంది, 256 ఉన్నత పాఠశాలల్లో 97,387మంది విద్యార్థులు చదువుతున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 1271 ప్రాథమిక, 72 ప్రాథమికోన్నత, 237 ఉన్నత పాఠశాలలు ఉండగా 1.42లక్షల మంది విద్యార్థులు చదువుతుండగా, తూర్పుగోదావరి జిల్లాలో అన్ని స్థాయిల పాఠశాలలు 973 ఉండగా, 89,085మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ విద్యా ర్థుల తల్లిదండ్రులు అందరూ మెగా పీటీఎంకు హాజరయ్యేలా చూడాలని ఉపాధ్యాయులకు స్పష్టమైన సూచనలు ఇచ్చారు.



ఆకాశంలో కనువిందు

కాకినాడ బీచ్‌లో గురువారం సాయంత్రం ఆకాశంలో కనువిందు చేసింది. సూర్యాస్తమయంవేళ ఆకాశంలో నీలిమబ్బులు ఇలా కుంకుమవర్ణాన్ని సంతరించుకున్నాయి. మబ్బుల లోంచి వస్తూ ప్రకాశించిన సూర్యకాంతులు ప్రకృతి ప్రేమికులకు సరికొత్త అనుభూతిని కల్పించాయి. కాకినాడ ఉప్పాడ బీచ్ వద్ద ఈ సుందర దృశ్యాన్నిఆంధ్రజ్యోతి కెమెరా బంధించింది.

-ఫొటోగ్రాఫర్, కాకినాడ

చింతూరులో మావోయిస్టులకు వ్యతిరేకంగా ర్యాలీ

చింతూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): అల్లూరిజిల్లా చింతూరులో గురువారం వివిధ ప్రాంతాలకు చెందిన యువకులు మావోయిస్టులకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వారంతా మావోయిస్టుల చర్యలను నిరసిస్తూ నినాదాలు చేశారు. మావోయిజం వద్దు అభివృద్ధి ముద్దు అంటూ నినదించారు. రహదారుల పనులకు వినియోగిస్తున్న యంత్రాలను తగులబెట్టడం, ఇన్‌ఫార్మర్ల నెపంతో అమాయక ఆదివాసీలను హత్యచేయడం ఎంతవరకు సమంజసమని వారంతా మావోయిస్టులను ప్రశ్నించారు. మావోయిస్టుల చర్యల కారణంగా పలు మారుమూల గ్రామాల కు రహదార్ల సౌకర్యం, బస్‌సౌకర్యం కూడా లేకుండాపోయిందని వారంతా ఆరోపించారు. కార్యక్రమంలో పలువురు యువకులు పాల్గొన్నారు.



చింతూరులో మావోయిస్టులకు వ్యతిరేకంగా ర్యాలీ చేస్తున్న గ్రామస్థులు

తప్పిపోయిన బాలుడిని క్షేమంగా అప్పగించిన పోలీసులు



తల్లి వద్దకు చేరిన బాలుడు ఏనాపు జగదీష్

సామర్లకోట, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట గోలివారి వీధికి చెందిన ఏనాపు జగదీష్ అనే అయిదేళ్ల బాలుడు గురువారం మ ధ్యాహ్నం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపాన రింగ్ సెంటర్‌వద్ద ఉన్న సాయిబాబా ఆలయానికి అమ్మమ్మ శేషారత్నంతో కలిసి వచ్చాడు అమ్మమ్మ గుడిలోకి వెళ్లి తిరిగి బయటకు వచ్చి చూసేసరికి తన మనుమడు కనిపించకపోవడంతో ఆదుర్దాగా పరిసర ప్రాంతాలలో వెతికినా కనిపించలేదు. దీంతో సామర్లకోట సీఐ కృష్ణభగవాన్‌కు అందించిన ఫిర్యాదుతో పట్టణంలోని అన్ని సీసీ కెమెరాల సీసీ పుటేజీలను పరిశీలించి బాలుడు స్థానిక భీమేశ్వర స్వామి ఆలయం రోడ్డులో ఉన్నట్లు గుర్తించి బాలుడిని క్షేమంగా పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. దీంతో అమ్మమ్మ శేషార త్నం, తల్లి శ్రీదేవిలకు క్షేమంగా పోలీసులు బాలుడు జగదీష్‌ను గురువారం సాయంత్రం అప్పగించారు. సామర్లకోట పోలీసులు చేసిన కృషిని ఎస్పీ బిందుమాధవ్, పెద్దాపురం డీఎస్పీశ్రీహరిరాజు అభినందించారు.

రేపు ఉమ్మడి జిల్లాల అండర్-17 బాలుర క్రికెట్ జట్టు ఎంపిక

అంబాజీపేట, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): అంబాజీపేట జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఈనెల 6వ తేదీన ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా అండర్-17 బాలుర క్రికెట్ జట్టును ఉమ్మడిజిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఎంపిక చేయనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీం బాషా ఓ ప్రకటనలో తెలిపారు. ఈ క్రీడలలో పాల్గొనే విద్యార్థులు ఉదయం 9గంటలకు స్థానిక క్రీడాప్రాంగణంవద్దకు చేరుకోవాలన్నారు. జిల్లా నుంచి వచ్చిన క్రీడాకారులు వారి వివరాలను ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు కొండేపూడిఈశ్వరరావు 9346920718, ఎస్.రమాదేవి 9440094984కు సంప్రదించాలని కోరారు.

లారీ ఢీకొని భార్యాభర్తల మృతి

- మరో ఇద్దరికి తీవ్రగాయాలు
- పుట్టిన మూడు నెలలకే తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారి



మృతిచెందిన దంపతులు లీలా ప్రసాద్, సౌమ్య(ఫైల్)

రాజానగరం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై రాజానగరం-నరేంద్రపురం కూడలిలో లారీ ఢీకొని భార్యాభర్తలు అక్కడికక్కడే మరణించారు. మరో ఇద్దరు మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. తూర్పుగోదావరిజిల్లా రాజానగరం మండలం నందరాడ గ్రామానికి చెందిన జుత్తుక లీలా ప్రసాద్ (20), రాజమహేంద్రవరం సమీపంలోని బర్మాకాలనీకి చెందిన సురేష్ సౌమ్య(21)తో ప్రేమ వివాహం జరిగింది. వీరికి మూడు నెలల కిందట పాప కూడా జన్మించింది. లీలా ప్రసాద్ ఎలక్ట్రికల్ పనిచేసుకుంటూ భార్యను పోషించుకుంటున్నాడు. ఈనేపథ్యంలో గురువారం మధ్యాహ్నం బ్యాంకు పనినిమిత్తం ఇరువురు మోటారు సైకిల్‌పై రాజానగరం బయలు దేరారు. రాజానగరం-నరేంద్రపురం కూడలి వద్ద హైవే దాటుతున్న తరుణంలో రాజమహేంద్రవరం నుంచి వైజాగ్ వైపుగా వేగంగా, నిర్లక్ష్యంగా వస్తున్న లారీ మోటార్ సైకిల్‌ను బలంగా ఢీకొంది. ఈప్రమాదంలో మోటార్ సైకిల్‌పై ప్రయాణిస్తున్న లీలా ప్రసాద్, సురేష్ సౌమ్యలు లారీచక్రాల కింద పడి అక్కడికక్కడే మృతి చెందారు. అలాగే ఇదే ప్రాంతంలో మరో ఇద్దరు మహిళలను కూడా లారీ ఢీకొనడంతో ఇరువురికి తీవ్రగాయాల య్యాయి. గాదరాడకు చెందిన వెంకటలక్ష్మికి కుడికాలుకు బలమైన గాయాలుకాగా, సూర్య కుమారికి కుడికాలుకు మడమ నుజ్జునుజ్జయింది. క్షతగాత్రులను చికిత్సకోసం రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈమేరకు మృతుల బంధువు సత్తిబా బు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఎస్.ప్రసన్న వీరయ్యగౌడ్ తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి



సత్యనారాయణ (ఫైల్)

రాయవరం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మోటార్ సైకిల్‌పై వెళుతున్న వ్యక్తిని ట్రాక్టర్ ఢీకొట్టడంతో మృతి చెందిన సంఘటనపై రాయవరం పోలీసులు కేసునమోదు చేశారు. ఎస్ఐ డి.సురేష్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని వెంటూరు గ్రామానికి చెందిన చందాల వీరవెంకట సత్యనారాయణ(57) డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 3న పని నిమిత్తం తన మోటారు సైకిల్‌పై తాళ్లపాలెం వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తుండగా తాళ్లపాలెం-వెం టూరు రోడ్డులో ట్రాక్టర్, ఢీకొట్టిన ప్రమాదంలో సత్యనారాయణ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడిపై ఆధారపడి వృద్ధులైన తల్లిదండ్రులు, భార్య భూలక్ష్మి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

అసలెలా పంపించారు?

- మేనమామనంటూ నమ్మించి గురుకుల పాఠశాలనుంచి బాలికను తీసుకెళ్లిన ఓ యువకుడు
- సహకరించిన ఓ మహిళ
- మళ్లీ ఉదయం విడిచిపెట్టిన వైనం
- ముమ్మిడివరం మండలం లంకాఫ్ రాణేలంకలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఘటన
- ఆందోళన చేపట్టిన బాలిక బంధువులు
- పాఠశాల సెక్యూరిటీ, ప్రిన్సిపాల్‌పై ఆగ్రహం
- కిడ్నాప్, అత్యాచారం, పోక్సో కేసు నమోదు

మేనమామనంటూ నమ్మించి గురుకుల పాఠశాలనుంచి బాలికను ఓ మహిళ సహకారంతో ఓ యువకుడు తీసుకెళ్ళిన సంఘటన అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం లంకాఫ్ రాణేలంకలోని ఓ సాంఘిక సంక్షేమ గురు కుల పాఠశాలలో చోటుచేసుకుంది. ఉదయం ఆ బాలికను విచిడిపెట్టాడు. దీంతో ఆ పాఠశాల సెక్యూరిటీ, ప్రిన్సిపాల్ ఎలా పంపించారని బా లిక బంధువులు ఆందోళన చేపట్టారు. అనంత రం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కిడ్నాప్, అత్యాచారం, పోక్సో కింద కేసు నమోదు చేశారు.

ముమ్మిడివరం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం మండలంలోని లంకాఫ్ రాణేలంకలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న మైనరు బాలిక (15)ను ఓ యువకుడు, మరో మహిళ బంధువును అని నమ్మించి ఆ పాఠశాల వసతిగృహం నుంచి తీసుకుపోవడంతో ఆ బాలిక బంధువులు గురుకుల పాఠశాలవద్ద గురువారం ఆందోళనకు దిగి పోలీసులను ఆశ్రయించారు. దీనికి సంబంధించిన బంధువులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాట్రేనికోన మండలం పల్లంకుర్రు పంచాయతీ పరిధిలోని ఓ మైనరు బాలిక సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. ఆ బాలిక తల్లి ఉపాధి నిమిత్తం గల్ఫ్‌లో ఉంటుండగా తండ్రి పనులకోసం వేరే రాష్ట్రంలో ఉండడంతో ఆ బాలిక నాన్నమ్మ, తాతమ్మల వద్ద ఉంటూ గురుకుల పాఠశాలలో చదువుకుంటుంది. ఈ మేరకు కాట్రేనికోన మండలం పల్లంకుర్రు పంచాయతీ పరిధిలో మోకా గిరిబాబు బుధవారం ఉదయం వసతిగృహానికి వచ్చి బాలికను ఆసుపత్రికి తీసుకువెళతానని చెప్పి పంపించమనగా గురుకుల పాఠశాలవారు నిరాకరించడంతో మరికొంత సేపటికి ఓ మహిళ తాను ఆ బాలిక మేనమామ భార్యను అని చెప్పి ఆసుపత్రి నిమిత్తం బాలికను గురుకుల పాఠశాల నుంచి తీసుకువెళ్లింది. అయితే బుధవారం సాయంత్రం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ డి.శారద హాజరు పరిశీలనలో ఒక విద్యార్థి తక్కువగా ఉండడాన్ని గుర్తించి ఆ బాలికను ఇంకా పంపలేదని నాన్నమ్మకు ఫోన్ చేయగా తాను ఎవరినీ పంపలేదని, మనుమరాలు ఇంటికి రాలేదని చెప్పగా గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పాఠశాల సెక్యూరిటీపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.. అయితే మోకా గిరిబాబు గురువారం ఉదయం ఆ బాలికను గురుకుల పాఠశాల వద్ద వదిలి వెళ్లిపోయినట్టు సమాచారం. బాలిక నాన్నమ్మ, బంధువులు గురువారం గురుకుల పాఠశాలకు చేరుకుని ఆందోళన చేపట్టి పోలీసులను ఆశ్రయించారు. తాము గురకుల పాఠశాల లోపలకు వెళ్లాలంటే సవాలక్ష ఆంక్షలు పెడుతున్నారని, అటువంటిది బయటి వ్యక్తులను ఎలా పంపించారని, తన మనుమరాలను ఎలా బయటికి పంపారని ప్రశ్నించి బాధ్యతా రాహిత్యంగా వ్యవహరించిన గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, సెక్యూరిటీపై చర్యలు తీసుకోవాలని, తనమనుమరాలిని తీసుకువెళ్లిన గిరిబాబుపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్ పర్యవేక్షణలో ముమ్మిడివరం సీఐ ఎం.మోహన్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ డి.జ్ఞానసాగర్ కేసు నమోదుచేసి బాలికను వైద్య పరీక్షల నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గిరిబాబు అతనిపాటు వచ్చి బాలికను తీసుకువెళ్లిన మహిళను అర్చనగా గుర్తించినట్టు తెలిసింది.

డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వోపై విచారణ

- పది అంశాలతో కూడిన ప్రశ్నావళి
- వాదనలు విన్పించిన వైద్యులు

చింతూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): చింతూరు డిప్యూటీ డీఎంహెచ్‌వో డా. పుల్లయ్యపై ఉన్న ఫిర్యాదుల మేరకు గురువారం చింతూరులో విచారణ జరిగింది. ఇక్కడి ప్రాథమిక వైద్యశాలల్లో విధులు నిర్వర్తించిన, నిర్వర్తిస్తున్న పలువురు వైద్యాధికారులు డా.పుల్లయ్యపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేయడం, ఆ మేరకు విచారణకు ఆదేశించిన విషయం విధితమే. ఈ క్రమంలో విజయవాడ నుంచి నేషనల్ ప్రోగ్రాం, ఫర్ కంట్రోల్ ఆఫ్ బ్లైండ్‌నెస్ అండ్ విజువల్ ఇంపెయిర్ మెంట్ (ఎన్‌పీసీబీ అండ్ వీఐ) జాయింట్ డైరెక్టర్ డా. బి.సునీల్‌కుమార్ నాయక్ విచారణ అధికారిగా వచ్చారు. గురు,శుక్రవారాలు రెండురోజులపాటు విచారణ జరుగనుంది. డా.పుల్లయ్యపై ఫిర్యాదులు ఇచ్చిన వారిలో పదిమంది వైద్యాధికారులు, ఆరోపణలు ఎదుర్కొంటున్న డా. పుల్లయ్య విచారణ అధికారి ఎదుట హాజరయ్యారు. వారితో విచారణ అధికారి విడివిడిగా మాట్లాడారు. తమ వాదనను విన్పించేందుకు విచారణ అధికారి ఎదుట హాజరైనవారిలో ప్రస్తుతం చింతూరు డివిజన్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఇరువురు వైద్యాధికారులు ఉండగా, ఇక్కడ విధులు నిర్వర్తించి వేర్వేరు ప్రాంతాలకు బదిలీపై వెళ్లిన ఎనిమిదిమంది వైద్యులు హాజరవడం గమనార్హం. కాగా వారందరికీ పది అంశాలతో కూడిన మూడేసి పేజీల ప్రశ్నావళి పత్రాలను విచారణ అధికారి అందించినట్లు సమాచారం. ఈనేపథ్యంలో ఆయా ప్రశ్నావళికి ఆధారాలతో కూడిన సమాధానాలు నేడు తిరిగి విచారణ అధికారికి అందించాల్సి ఉంది. అదేదశలో డా.పుల్యయ్య తనపై ఫిర్యాదులు చేసిన వైద్యాధికారులు విధి నిర్వహణ తీరు, ఆ మేరకు పలు అంశాలతో కూడిన ఆరోపణ పత్రాలను సిద్ధం చేసినట్లు వాటిని విచారణ అధికారికి శుక్రవారం అప్పగించనున్నట్లు సమాచారం. దీంతో విచారణ అధికారి గురువారం సాయంత్రం ఏడుగురాళ్ళపల్లి, లక్ష్మీపురం, నెల్లిపాక గ్రామాలలో నేరుగా పలువురిని కలుసుకొని వైద్యాధికారులుఆరా తీసినట్లు తెలుస్తోంది. ఆంధ్రజ్యోతి విచారణ అధికారి డా.సునీల్‌కుమార్ నాయక్‌ను సంప్రదించగా విచారణ జరుగుతోందని, ఇది శాఖాపరమైన విచారణ కావడంతో విచారణలో తన దృష్టికి వచ్చిన అంశాలను బహిర్గతం చేయలేనన్నారు. పూర్తిస్థాయి విచారణలో తన దృష్టికి వచ్చిన అంశాలను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు.

వాకలపూడి సముద్రతీరంలో రసాయనిక వ్యర్థాలు

- ప్రమాదకరమైన కెమికల్స్ లారీని పట్టుకున్న మత్స్యకారులు
- మత్స్య సంపదకు హాని కలిగిస్తున్న కంపెనీపై చర్యలు తీసుకోవాలి
- కాకినాడ బీచ్‌రోడ్డులో ఆందోళన చేపట్టిన మత్స్యకారులు

సర్పవరంజంక్షన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): కాకినాడజిల్లా కాకినాడరూరల్ మండలం వాకలపూ డి-సూర్యారావుపేట సరిహద్దులోగల శాలోడి ప్రధాన డ్రెయిన్‌లో ట్యాంకర్ నుంచి తీసుకొచ్చిన రసాయనిక వ్యర్థాలను పైపులైన్‌ద్వారా డంపింగ్ చేస్తుండగా మత్స్యకారులు పట్టుకున్నారు. కొన్నేళ్లుగా ప్రమాదకర రసాయనిక వ్యర్థాలు తీసుకొచ్చి సముద్రంలో డంపింగ్ చేస్తుండడంతో మత్స్య సంపద అంతరించుకు పోతుందని, తక్షణమే సదరు కంపెనీ నిర్వాహకుడిని అరెస్ట్ చేసి న్యాయం చేయాలని కోరుతూ గురువారం ఉదయం వాకలపూడి బీచ్ రోడ్డులో శ్రీసాయి శ్రీనివాసా (ఎస్ఎస్ఎస్) ట్రేడర్స్ కంపెనీవద్ద వాకలపూడి హ ర్బార్‌పేట, సూర్యారావుపేట మత్స్యకారులు ఆందోళన నిర్వహించారు. మత్స్యకారుల ఆందోళనతో కాకినాడ-ఉప్పాడ బీచ్‌రోడ్డులో ట్రాఫిక్ స్తంభించింది. దీంతో సర్పవరం పోలీస్‌స్టేషన్ సీఐ బి.పెద్దిరాజు, తహశీల్దార్ ఎస్ఎల్ఎన్ కుమారి, మత్స్యశాఖ ఏడీ కరుణాకర్, పొల్యూషన్‌శాఖ అధికారులు చేరుకుని మత్స్యకారులతో చర్చించారు. ఈసందర్భంగా మత్స్యకారులు మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా ఎస్ఎస్ఎస్ ట్రేడర్స్ కంపెనీ స్థలాన్ని లీజుకు తీసుకున్న వ్యక్తి కరప మండలం పెద్ద కొత్తూరుకు చెందిన చింతా శ్రీనివాస్ లారీ ట్యాంకర్‌లో కెమికల్స్ వ్యర్థాలను తెలంగాణా, ఏపీల నుంచి తీసుకొచ్చి బీచ్‌రోడ్డులోగల సాలోడు ప్రధాన డ్రెయిన్‌లోకి పంపింగ్ చేస్తున్నాడని తెలిపారు. కంపెనీలో ఎటువంటి కార్యక్రమం జరక్కపోవడంతో ప్రధాన గేటుకి తాళంవేసి ఉంటుందని, రాత్రి సమయాల్లో కెమికల్స్ వ్యర్థాలతో రోజుకి సుమారు 3 ట్యాంకర్లు తీసుకొచ్చి, నేరుగా ఉప్పుటేరు, సముద్రంలో కలిసే విధంగా విడిచిపెడుతున్నారని ఆందోదళన వ్యక్తం చేశారు. ప్రమాదకర కాలుష్యకారక రసాయనిక వ్యర్థాలతో తీరంలో నిత్యం చేపపిల్లలు, తాబేళ్లు మృత్యువాత పడుతున్నాయని, జీవనో పాధి దెబ్బతింటుందన్నారు. సముద్రంలో చేప పిల్లలుచచ్చిపోయి, తీరంలో రోజు దర్శనమి స్తున్నాయని వాపోయారు. గేటుకి తాళం వేయడంతో లోపల ఏం జరుగుతుందో బయటకు తెలియదని, ఈ లారీని పట్టుకు నేందుకు కాపలాకాయగా బుధవారం రాత్రి కెమికల్ వ్యర్థాలతో ఉన్న ట్యాంకర్‌ని పట్టుకుని పోలీసులకు సమాచారం ఇచ్చామన్నారు. ఈ సందర్భంగా అధికారులు వచ్చి లారీని సీజ్‌చేసి, షెడ్డులో ఉన్న ఆయిల్ డబ్బాల నుంచి శాంపిల్స్ తీసుకున్నారు. శాంపుల్స్ పరీక్షించిన తర్వాత నిర్వాహకుడిపై చర్యలు తీసుకుంటామని, ప్రమాదకర కాలుష్య కారక వ్యర్థాలు తీరంలో డంపింగ్ చేకుండా చర్యలు తీసుకుంటామని అధికారులు మత్స్యకారులకు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. మత్స్యకారుల ఫిర్యాదు మేరకు చింతా శ్రీనివాస్‌పై కేసు నమోదుచేసి దర్యాప్తు చేయాల్సిందిగా తహశీల్దార్ కుమారి ఆదేశించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పెద్దిరాజు తెలిపారు.



కాకినాడ బీచ్‌రోడ్డులో ఆందోళన నిర్వహిస్తున్న మత్స్యకారులు



శాంపుల్స్ సేకరిస్తున్న తహశీల్దార్ కుమారి, సీఐ పెద్దిరాజు

సమస్యల పరిష్కారంలో యూటీఎఫ్ ముందంజ

జిల్లా కోశాధికారి ప్రసాదరావు


ఊలపల్లిలో ప్రమాణం చేస్తున్న యూటీఎఫ్ నూతన కార్యవర్గ సభ్యులు

బిక్కవోలు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో యూటీఎఫ్ ముందంజలో ఉంటోందని జిల్లా కోశాధికారి ఈవీవీఎస్ ప్రసాదరావు అన్నారు. ఊలపల్లిలో బుధవారం రాత్రి యూటీఎఫ్ మండల నూతన కార్యవర్గం ఏర్పాటయ్యింది. ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ ఐఆర్ ప్రకటించి పీఆర్సీ కమిటీని నియమించాలని, ఉపాధ్యాయులకు బోధనేతర కార్యక్రమాలు రద్దు చేయాలని, టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని, సీపీఎస్ రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలాధ్యక్షుడిగా చిట్టూరి గోవిందరావు, ప్రధాన కార్యదర్శిగా ఎస్.సతీష్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడిగా సీహెచ్ వీరభద్రరావులతో పాటు ఇతర కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఇటీవల పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయులు కె.అమ్మిరెడ్డి, కె.వీర్రాఘవరెడ్డి, వి.శ్రీనివాసరావులతో పాటు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన ఎం.శారదాజ్యోతి, ఎంటీఆర్ షరీఫ్, పీడీ యువరాజారెడ్డిలను సత్కరించారు. కార్యక్రమంలో పలువురు యూటీఎఫ్ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

దత్త జయంతి వేడుకలు

రాజానగరం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): దత్త జయంతిని మండలంలోని పలు గ్రామాల్లో గురువారం వైభవంగా నిర్వహించారు. దీనిలో భాగంగా రాజానగరం, చక్రద్వారబంధం, పల్లకడియం,రాధేయపాలెం, తూర్పుగోనగూడెం తదితర గ్రామాల్లోని బాబా ఆలయాల్లో దత్తాత్రేయ స్వామికి, షిర్డీసాయి బాబాకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేపట్టారు. గురుచరిత్ర పారాయణం జరిపించారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదానంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దత్తాత్రేయ, బాబాను దర్శించుకుని, అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

రహదారి భద్రతపై ప్రజలకు అవగాహన

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్- 2 ఆధ్వర్యంలో పిడింగొయ్యి గ్రామంలో నిర్వహిస్తున్న ప్రత్యేక సేవా శిబిరంలో భాగంగా వలంటీర్లు గురువారం రహదారి భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. కవలగొయ్యి, పిడింగొయ్యి గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. అనంతరం పిడింగొయ్యి ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలసి కాలుష్య నివారణపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమాల్లో ప్రోగ్రామ్ ఆఫీసర్ హెచ్ శ్రీరామ్ పవన్, హెచ్ఎం సుజాత, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల ఆక్రమణపై విచారణ


అనపర్తిలో ఆక్రమణలపై సర్వే నిర్వహిస్తున్న రెవెన్యూ సిబ్బంది

అనపర్తి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఇటీవల అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులపై అధికార యంత్రాంగం కదిలింది. అనపర్తిలోని బాపనమ్మ ఉపాలయం, ఆంధ్రా బ్యాంక్ వీధుల్లో పలు స్థలాలు ఆక్రమణలకు గురయ్యాయని వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో గురువారం తహశీల్దార్ అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో రెవెన్యూ, పంచాయతీ అధికారులు సర్వే నిర్వహించారు. అందుబాటులో ఉన్న రికార్డుల ఆధారంగా ఆక్రమణలు ఉన్నట్టు గుర్తించామని, వీటిని తొలగించి ప్రజలకు ఇబ్బంది కలుగకుండా చేస్తామని తహశీల్దార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ కేవీ దొర, పంచాయతీ కార్యదర్శి ఫణికుమార్, వీఆర్వోలు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కూలీలకు సాగుభూమి పంపిణీ చేయాలి

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలైన వ్యవసాయ కూలీలకు సాగు భూమి పంపిణీ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాటిపాక మధు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం సాయంత్రం రాజమహేంద్రవరంలోని సీపీఐ కార్యాలయంలో ఈ నెల 13వ తేదీన ఏలూరులో జరిగే భూ పోరాట సదస్సు కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ జిల్లాలో వేలాది ఎకరాల ప్రభుత్వ మిగులు భూములు భూస్వాముల చేతుల్లో ఉన్నాయని, వారి నుంచి ఆ భూములను స్వాధీనం చేసుకుని పేదలకు పంచాలని కోరారు. నాయకులు తోట లక్ష్మణ్, పి.లావణ్య, రాంప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మోగ్లీ.. సరికొత్త ప్రేమకథ

హీరో రోషన్ కనకాల


మీడియాతో మాట్లాడుతున్న హీరో రోషన్ కనకాల

రాజమహేంద్రవరం కల్చరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మించిన మోగ్లీ చిత్రంలో ప్రేమలోని సరికొత్త కోణాన్ని చూపించబోతున్నామని చిత్రం హీరో రోషన్ కనకాల తెలిపారు. సినిమా ప్రమోషన్లో భాగంగా స్థానిక ఎఫ్‌కేఫ్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మా మోగ్లీ సినిమా ఒక అసాధారణ చిత్రమని, ఒక సాధారణ యువకుడిగా తన పాత్ర కోసం విశేష పరిశోధనలు చేశానని, చిత్ర కథ.. ప్రేక్షకులను గతంలోని తమ మధురమైన ప్రేమ జ్ఞాపకాలను, గుర్తు చేసుకొని, మైమరపించేలా చేస్తుందన్నారు. ముఖ్యంగా దర్శకుడు సందీప్‌రాజ్ ప్రతీ ఫ్రేమ్‌ను వినూత్నంగా తీర్చిదిద్దడానికి అహర్నిశలు శ్రమించారన్నారు. విశాఖపట్నం,పాడేరు, పార్వతీపురం ఏరియాల్లో ఎక్కువగా షూటింగ్ జరిగిందని, ఈ చిత్రానికి హర్ష కామెడీ, కాళ భైరవ మ్యూజిక్ హైలెట్‌గా నిలుస్తాయని పేర్కొన్నారు.హీరోయిన్ సాక్షి మాట్లాడుతూ ఇది తన తొలి చిత్రమని,ప్రేక్షకులకు ట్యూన్ అయ్యేలా దర్శకులు చిత్రీకరించారని, ఏ చిత్రమైనా గోదావరి జిల్లాల ప్రేక్షకుల ఆదరణ పొందితే తప్పకుండా హిట్ అవుతుందని అన్నారు.

అదృశ్యమైన బాలిక గోదావరిలో విగతజీవిగా..

సీతానగరం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పురుషోత్తపట్నం గ్రామానికి చెందిన మల్లి సాత్విక(13) గోదావరిలో విగతజీవిగా కనిపించింది. గురువారం పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పురుషోత్తపట్నం గ్రామానికి చెందిన సాత్విక మూగ బాలిక. ఈ నెల 1వ తేదీ సాయంత్రం సుమారు 5 గంటల వరకు తోటి పిల్లలతో ఆడుకుంటూ గడిపిన సాత్విక తరువాత కనిపించకుండాపోయింది. దీంతో ఈ నెల 2న సాత్విక పెదనాన్న బాపిరాజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో గురువారం ఉదయం 6 గంటలకు గ్రామానికి చెందిన చింతాడ సత్యనారాయణ స్థానిక రావిచెట్టు ర్యాంపు నుంచి గోదావరి వద్దకు పనిమీద వెళ్లగా గోదావరిలో నీటిపై తేలి ఉన్న మృతదేహాన్ని చూసి బాలిక తల్లిదండ్రులకు తెలియపరిచాడు. వారు చూసి గుర్తుపట్టి పోలీసులకు సమాచారం అందించగా ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ డి.రామ్‌కుమార్ తెలిపారు.

కోరుకొండలో ఉచిత హోమియో వైద్య శిబిరం


శిబిరంలో పరీక్ష చేయించుకుంటున్న ఎమ్మెల్సీ సోము

కోరుకొండ, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): కోరుకొండలో రెడ్డి పంతుల సత్రంలో గురువారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. ఉదయం ఈకే ఆధ్యాత్మిక సేవ సంస్థ గ్రామ సేవ యజ్ఞం మహోత్సవాల సందర్భంగా బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో చేపట్టిన ఈ శిబిరాన్ని ఎమ్మెల్సీ సోము వీర్రాజు ప్రారంభించారు. పలువురికి హోమియోపతి వైద్యులు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, మండలాధ్యక్షుడు అడపా సుధీర్‌కుమార్, మహిళా అధ్యక్షురాలు మద్దిపాటి రజిని, ఏపీఆర్ చౌదరి, సర్పంచ్ కర్రి లక్ష్మీ సరోజ, మోడీ సత్తిబాబు, తగరంపూడి గణపతి, పచారి నరసింహమూర్తి, పెనకేటి రాంబాబు, బదిరెడ్డి దొర పాల్గొన్నారు.

మధురపూడి కనకదుర్గమ్మ తీర్థానికి ఏర్పాట్లు

కోరుకొండ, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని మధురపూడి కనకదుర్గమ్మ తీర్థ ఆదివారం ఉదయం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఉదయం ఆలయం వద్ద దాతల సహకారంతో అన్నదానం, మహిళలకు రవికెలు, పసుపు, కుంకుమ అందజేశారు. అమ్మ వారి తీర్థానికి అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. కార్యక్రమంలో కోనే రామకృష్ణ, ఆకుల శ్రీనివాస్, పిల్ల వీరవెంకట్రావు, గణేశుల పోసియ్య, గణేశుల త్రిమూర్తులు, మాధవరపు గంగారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణం నరకప్రాయం


రాళ్లు లేచిపోయి అధ్వానంగా ఉన్న గోకవరం-చిన్నూరు రోడ్డు


చిన్నపాటి వర్షానికే చెరువును తలపిస్తున్న గాదెలపాలెం- ఇటికాయిలపల్లి రోడ్డు(ఫైల్)

గోకవరం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో రహదారుల గురించి పట్టించుకోకపోవడంతో మండలంలోని పలు ప్రధాన రహదారులు అధ్వానంగా మారాయి. దీంతో ప్రయాణం నరకప్రాయంగా మారింది. ఆయా గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు, ప్రజల నుంచి ఎన్ని వినతులు అధికారులకు అందినా పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో ప్రస్తుతం పలు రోడ్ల దుస్థితి అధ్వానంగా ఉంది. వాహనదారుల పాలిట శాపంగా పరిణమిస్తున్నాయి. కంకర రాళ్లు పైకి లేచి ప్రమాదకరంగా మారిన రోడ్లు కొన్ని ఉంటే, చిన్నిపాటి వర్షానికే చెరువులను తలిపించే రహదారులు మరికొన్ని. గోకవరం-చిన్నూరు ప్రధాన రహదారి కడు దయనీయంగా మారింది. ఈ రోడ్డు ఎన్నో ఏళ్ల నుంచి అధ్వానంగా మారినప్పటికీ ఏ ఒక్కరూ పట్టించుకున్న దాఖలాలు కనిపించలేదు. ప్రస్తుతం ఈ రోడ్డుపై ప్రయాణం కొనసాగించాలంటే ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని వాహనాలను నడపే సాహసం చేయలాల్సిందే. గాదెలపాలెం- ఇటికాయిలపల్లి రహదారికి కూడా ఇదే పరిస్థితి ఏర్పడింది. రోడ్డుపై పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. చిన్నపాటి వర్షం కురిస్తే చాలు రోడ్డుపై ఉన్న గోతులు చెరువులను తలపిస్తున్నాయి. బయట ప్రాంతాలకు చెందిన వాహనదారులు ఈ రోడ్డుపై ప్రయాణించేటప్పుడు గోతులు గమనించకపోతే ప్రమాదాల బారినపడి ఆసుపత్రి పాలవ్వలిసిందే. వీటితో పాటు మండలంలోని బావాజీపేట- వెదురుపాక, రంపయర్రంపాలెం- గోకవరం రహదారులు కూడా అధ్వానంగా తయారయ్యాయి.

వైద్య సేవల్లో నిరక్ష్యాన్ని సహించం

- ఎమ్మెల్యే నల్లమిల్లి
- రామవరం పీహెచ్‌సీలో తనిఖీలు
- వైద్యులు, సిబ్బంది పనితీరుపై ఆగ్రహం


ఓపీ లేకపోవడంపై వైద్యాధికారిని ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఆరోగ్య కేంద్రాల్లో రోగులకు సేవలందించడంలో వైద్యులు, వైద్య సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని రామవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఉదయం 9.35 నిమిషాలకు ఆసుపత్రికి వెళ్లిన ఎమ్మెల్యేకు అక్కడ వైద్యులు గాని, సిబ్బంది గానీ లేరు. కొద్ది సేపటికి డాక్టర్, కొంత మంది సిబ్బంది వచ్చారు. వైద్యులు గానీ సిబ్బంది గానీ అందుబాటులో ఉండడం లేదని, మందులు కూడా పూర్తి స్థాయిలో ఇవ్వడం లేదంటూ వారం పది రోజులుగా తనకు పలువురు ఫిర్యాదు చేశారన్నారు. వారం రోజుల ఓపీ వివరాలను పరిశీలించిన ఆయనకు రోజుకు పది అంకె కూడా దాటకపోవడాన్ని గుర్తించి డీఎంహెచ్‌వోకు ఫోన్ చేసి పీహెచ్‌సీ పరిస్థితిని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ జిల్లా స్థాయిలో వైద్య ఆరోగ్యశాఖ పనితీరు పేలవంగా ఉందని, క్షేత్ర స్థాయిలో అనేక సమస్యలు ఉన్నప్పటికీ పట్టించుకునే తీరిక అధికారులకు లేకుండా పోయిందన్నారు. ఈ విషయాలను వైద్య ఆరోగ్య శాఖ మంత్రికి, సీఎం దృష్టికి తీసుకెళ్తానన్నారు. రామవరం పీహెచ్‌సీలో ఉన్న 16 మంది సిబ్బంది 9గంటలకే హాజరు కావలసి ఉండగా 9.35గంటలకు ఐదుగురు మాత్రమే హాజరయ్యారని,సిబ్బంది నిర్లక్ష్యం వల్ల రోగుల సంఖ్య కూడా తగ్గిందని ఇలా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సర్పంచ్ గిరిడా గంగాభవాని, సొసైటీ అధ్యక్షుడు నల్లమిల్లి సుబ్బారెడ్డి, నాయకులు చింతా సురేష్‌రెడ్డి,నల్లమిల్లి శ్రీనివాసరెడ్డి, తేనెల శ్రీనివాస్ పాల్గొన్నారు.

రజకుల సమస్యల పరిష్కారానికి కృషి

- ఎమ్మెల్యే గోరంట్ల
- 16వ డివిజన్‌లో దోబిఖానా ఆధునీకరణకు శంకుస్థాపన


దోబిఖాన పనుల శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గోరంట్ల

రాజమహేంద్రవరం రూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రజకుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని వారికి ప్రత్యేక కాలనీ ఏర్పాటుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ 16వ డివిజన్‌లో రూ.17.70 లక్షల వ్యయంతో చేపట్టిన గౌతమి దోబిఖాన ఆధునీకరణ పనులకు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గోరంట్ల మాట్లాడుతూ రాజమహేంద్రవరంలో తొలి దోబిఖాన ఇదేనని,తన హయాంలోనే దానిని నిర్మించామన్నారు. పైప్‌లైన్ పాడై నీరు సరిగా అందడంలేదని, దాంతో దోబీఖానను ఆధునీకరిస్తున్నామని, మరో బోరు వేయిస్తామన్నారు. అలాగే జంగిల్ క్లియరెన్స్ చేయించాలన్నారు. తొలుత స్థానిక యూపీహెచ్‌సీలో స్వీయ నిధులతో వాటర్ ఫిల్టర్‌ను ఏర్పాటు చేశారు. టీబీ రోగులకు పౌష్టికాహారం నిమిత్తం రూ.30 వేలు అందజేశారు. వైద్యులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో టూరిజం, శాలివాహన కార్పొరేషన్ల డైరెక్టర్లు వాసిరెడ్డి రాంబాబు, దాలిపర్తి వేమన, జిల్లా వైద్యాధికారి వసుంధర, డాక్టర్ వినీత, ఏడాకుల వెంకటేశ్వరరావు, కుంచే హనుమంతరావు, చలమూరి సత్యనారాయణ, శీలం గోవిందు పాల్గొన్నారు.

ప్రాతఃస్మరణీయుడు ఘంటసాల

- తెలుగు యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ మునిరత్నంనాయుడు
- వెంకటేశ్వరరావు 103వ జయంతి


ఘంటసాల విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

ధవళేశ్వరం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): తన గాన మాధుర్యంతో తెలుగు వారి హృదయాల్లో చెరగని ముద్ర వేసిన మధుర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రాతఃస్మరణీయుడు అని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో వైస్ ఛాన్సలర్ ఆచార్య డి.మునిరత్నం నాయుడు అన్నారు. ఘంటసాల 103వ జయంతి కార్యక్రమాన్ని రాజమహేంద్రవరం రాకా సాంస్కృతిక సంస్థ కార్యదర్శి జీవీ రమణ, గోదావరి కల్చరల్ అసోసియేషన్ ధవళేశ్వరం అధ్యక్షుడు యర్రమోతు ధర్మరాజు సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక ఇరిగేషన్ పార్కులో ఉన్న ఘంటసాల విగ్రహానికి మునిరత్నం నాయుడు, ఆదాయపు పన్ను శాఖ విశ్రాంత చీఫ్ కమిషనర్ మేడిశెట్టి తిరుమలకుమార్, విజయ శంకర ప్రభుత్వ సంగీత నృత్య పాఠశాల ప్రిన్సిపాల్ పసుమర్తి శ్రీనివాస్ శర్మ అతిథులుగా విచ్చేసి ఘంటసాల విగ్రహం వద్ద పుష్పాంజలి ఘటించారు.ఈ సందర్భంగా మునిరత్నం నాయుడు మాట్లాడుతూ వేలాది పాటలతో శ్రోతల మదిని దోచిన ఘంటసాల మాస్టరు భగవద్గీత గానంతో తన గొంతును ప్రతి ఇంట వినిపించారన్నారు.అనంతరం అతిథులకు మెమెంటోలు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో సూరపు రెడ్డి తాతారావు, తిరుమల కృష్ణమోహన్, పీఎస్ శేషుకుమార్, ఎం.రమేష్, గాదిరాజు రామరాజు పాల్గొన్నారు.

వన్‌స్టాప్ సెంటర్లతో బాధిత మహిళలకు భరోసా

ఎమ్మెల్యే వాసు.. జీజీహెచ్‌లో వన్‌స్టాప్ సెంటర్ భవనానికి శంకుస్థాపన

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): బాధిత మహిళలకు భరోసా కల్పించడానికి వన్‌స్టాప్ సెంటర్లు దోహదం చేస్తాయని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. గురువారం రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రి ప్రాంగణంలో రూ.60 లక్షల కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మిస్తున్న వన్‌స్టాప్ సెంటర్ భవన నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాధిత మహిళలకు వైద్య, పోలీసు, న్యాయ సహాయంతోపాటు కౌన్సెలింగ్‌తో తాత్కాలిక ఆశ్రయం కల్పించడానికి ఈ సెంటర్ ఉద్దేశించినట్టు తెలిపారు. 181 హెల్ప్‌లైన్ ద్వారా 24 గంటలూ ఈ కేంద్రం ద్వారా అన్ని సేవలు అందుతాయని వెల్లడించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

అసంక్రమిత వ్యాధుల నివారణకు పీఎల్ఏ-ఎన్‌సీడీ



కమ్యూనిటీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అధికారులు

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అసంక్రమిత వ్యాధుల కోసం పాల్గొనడం, నేర్చుకోవడం, చర్య తీసుకోవడం కోసం పీఎల్ఏ-ఎన్‌సీడీ పేరుతో వినూత్న కమ్యూనిటీ కార్యక్రమాన్ని ప్రారంభించినట్టు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. గురువారం రాజమహేంద్రవరంలో జిల్లా ఎన్‌సీడీ కార్యక్రమ అధికారి డాక్టర్ హరిశ్చంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో నూరా హెల్త్ రాష్ట్ర, జిల్లా బృందాలైన డాక్టర్ రేష్మా, డాక్టర్ సందీప్, డాక్టర్ హేమంత్, డాక్టర్ కార్తీక్ తదితరులు వారి శిక్షణ బృందంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వైద్యాధికారులు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, ఏఎన్ఎంలు, ఎల్‌హెచ్‌వీలు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత



ఐఎస్‌టీఎస్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థినుల ర్యాలీ

రాజానగరం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యతగా గుర్తించాలని ఇంటర్నేషనల్ స్కూల్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ ఫర్ ఉమెన్ (ఐఎస్‌టీఎస్) కళాశాల ఎన్ఎస్ఎస్ పీవో గండేపల్లి శ్రీలక్ష్మి పేర్కొన్నారు. ఐఎస్‌టీఎస్ దత్తత గ్రామాలైన తూర్పుగూడెం, రాజానగరం గ్రామాల్లో ఎన్ఎస్ఎస్ సేవా శిబిరంలో భాగంగా వలంటీర్లు పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీ చేట్టారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటి సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. విద్యార్థినులంతా ప్లకార్డులు చేతబట్టి ప్రదర్శన, ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ దివ్య మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ముగ్గురికి మూడు రోజుల జైలు

అనపర్తి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఇటీవల నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలో పట్టుబడ్డ ముగ్గురు వ్యక్తులకు మూడేసి రోజుల పాటు జైలు శిక్ష విధించినట్టు ఎస్ఐ శ్రీను నాయక్ తెలిపారు. ఇటీవల నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసి గురువారం అనపర్తి జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరుపరచగా ఒక్కొక్కరికీ మూడు రోజుల జైలు శిక్ష విస్తూ న్యాయమూర్తి వంశీకృష్ణ తీర్పు వెలువరించారన్నారు.

విద్యార్థులకు స్పోర్ట్స్ యూనిఫామ్ పంపిణీ

సీతానగరం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పెందుర్తి సేవాసమితి సౌజన్యంతో గురువారం మండలంలోని వంగలపూడి జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు పెందుర్తి అభిరామ్ స్పోర్ట్స్ యూనిఫామ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఆటపాటల్లో ముందుండాలని దీని ద్వారా శారీరక దృఢత్వం, మానసికోల్లాసం కలుగుతుందని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గద్దే సురేష్, నీరుకొండ శ్రీనివాసరావు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గోరంట్ల పరామర్శ

కడియం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యకర్త పోతుల శేషగిరి మృతి పార్టీకి తీరని లోటని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు.మురమండ గ్రామానికి చెందిన టీడీపీ యువ కార్యకర్త పోతుల శేషగిరి ఇటీవల మృతి చెందారు. దీంతో ఆయన కుటుంబాన్ని గురువారం గోరంట్ల పరామర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, పాలెం సర్పంచ్ అన్నందేవుల చంటి, ప్రత్తిపాటి రామారావు చౌదరి, దేవళ్ల రాంబాబు, వట్టికూటి జానకీరామ్ పాల్గొన్నారు.

గోదావరికి మహానీరాజనం

కొవ్వూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో అఖండ గోదావరిమాతకు మహానీరాజనం అందజేశారు. మార్గశీర్ష పౌర్ణమి సందర్భంగా గోదావరి నీరాజన సమితి ఆధ్వర్యంలో గురువారం ప్రధాన స్నానఘట్టంలో గోదావరిమాతకు ప్రదోషకాలంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వివిధ రకాల హరతులతో నీరాజనం సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

స్కేటింగ్‌లో మెహ్నాజ్‌కు రెండు గోల్డ్‌మెడల్స్


క్రీడాకారిణి మెహ్నాజ్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

రాజమహేంద్రవరం కల్చరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా కళాశాల విద్యార్థిని స్కేటింగ్‌లో రెండు గోల్డ్‌మెడల్స్, ఒక సిల్వర్ మెడల్ సాధించినట్టు ప్రిన్సిపాల్ పి.రాఘవకుమారి తెలిపారు. కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం బైపీసీ చదువుతున్న హనీషాహ్ మెహ్నాజ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కాకినాడలో ఈ నెల 1 నుంచి 3వరకు నిర్వహించిన జిల్లా స్థాయి అండర్-17 స్కేటింగ్ పోటీల్లో 500+డి మీటర్ల విభాగంలో గోల్డ్ మెడల్, 1000 మీటర్ల విభాగంలో గోల్డ్ మెడల్, లాప్ విభాగంలో సిల్వర్ మెడల్‌ను సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్టు పీడీలు వై.సుధారాణి, ఎ.నాగు తెలిపారు. ఈ నెల 24 నుంచి 30వరకు జరగబోయే జాతీయ పోటీల్లో మెహ్నాజ్ పాల్గొంటుందని చెప్పారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన విద్యార్థినిని కళాశాల అధ్యాపకులు, తోటి విద్యార్థినులు అభినందించారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

బిక్కవోలు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, ప్రోత్సహించరాదని కూటమి నాయకులు తెలిపారు. రంగాపురంలోని అంగన్వాడీ కేంద్రాల్లో గురువారం నెలవారీ పౌష్టికాహార పంపిణీ నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాలను చేయబోమని గ్రామస్థులతో ప్రతిజ్ఞ చేయించారు. గర్భిణులకు సీమంతాలు జరిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కేతా ఏసురత్నం, నాయకులు నడింపిల్లి చిరంజీవిరాజు, చెల్లే జోష్‌బాబు, మారిశెట్టి శ్రీను, ఆరోగ్య, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

నెలాఖరు నుంచి చలో విశాఖ

నిడదవోలు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఈ నెల 31నుంచి జనవరి 4 వరకు విశాఖలో జరిగే మెప్మా ఆర్పీల బహిరంగ సభను జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకులు జువ్వల రాంబాబు పిలుపునిచ్చారు. గురువారం నిడదవోలు మున్సిపల్ కార్యాలయంలో మెప్మా ఆర్పీలంతా కలిసి చలో విశాఖ కరపత్రాలను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ సీఐటీయూ అఖిలభారత మహాసభలు జయప్రదం చేయాలని, దీనికి కేరళ సీఎం విజయ్ హాజరవుతున్నారన్నారు.




కోట సత్తెమ్మ తిరునాళ్లు ప్రారంభం





నిడదవోలు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం కోట సత్తెమ్మ తిరునాళ్లు గురువారం నుంచి ఆరంభ మయ్యాయి. వైదిక స్మార్త ఆగమ ఆచారం ప్రచారం దేవులపల్లి వంశస్తులు కలశ స్థాపనతో ఉత్సవాలను ప్రారంభించారు. ఉదయం విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, పంచగ్రవ్య ప్రాసన, మండపారాధన,మహాలింగార్చన, సూర్యనమస్కారాలు, మహాన్యాస పఠనం, అనంతరం కోట సత్తెమ్మ అమ్మవారు ఏకాదశ రుద్రాభిషేకాలు, లక్ష కుంకుమార్చన నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు అప్పారావుశర్మ ఆధ్వర్యంలో మహానివేదన, నీరాజన మంత్ర పుష్పాలు జరిగాయి. దేవులపల్లి రవిశంకర్ దంపతులు, దేవులపల్లి వంశస్థులు పూజల్లో పాల్గొన్నారు. ప్రత్యేక స్వర్ణాభరణాలతో, ప్రత్యేక పూల అలంకరణలో ఉన్న అమ్మవారిని భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.ఈ నెల 8వ తేదీ వరకూ ఉత్సవాలు జరుగుతాయని దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ వి.హరి సూర్యప్రకాష్ తెలిపారు. తెలిపారు.

వీళ్ల ప్రేమను.. సమాధి చేసిన లారీ!



ఇద్దరూ ఇష్టపడ్డారు.. ప్రేమ వివాహం చేసుకున్నారు.. వీరి ప్రేమకు గుర్తుగా మూడు నెలల కిందట పాప జన్మించింది.. ఆనందంగా సాగిపోతోంది జీవితం.. ఆ ఆనందం చూసి విధికి కన్నుకుట్టిందో ఏమో కానీ..లారీ రూపంలో వారిద్దరినీ మృత్యువు కబళించింది.. వారి ప్రేమకు గుర్తుగా పుట్టిన చిరుపాపం మాత్రం తల్లిదండ్రుల వెంట లేకపోవడంతో ప్రమాదం నుంచి బయటపడి అనాథగా మారింది..ఈ విషాద ఘటన రాజానగరం - నరేంద్రపురం కూడలిలో గురువారం జరిగింది.. లారీ అతివేగమే ప్రమాదానికి కారణంగా భావిస్తున్నారు.

ఉపాధికి మస్కట్ వెళితే.. హింసకు గురై ఇంటికి..

8

అక్రమ.. పరుగులు!



- లేఅవుట్ల క్రమబద్ధీకరణకు పరుగులు
- ఎల్ఆర్ఎస్‌కు 15598 దరఖాస్తులు
- ప్రభుత్వానికి రూ.127 కోట్ల రాబడి
- గత వైసీపీలో భారీగా అక్రమ లేఅవుట్లు
- చూసీచూడనట్లు వదిలేసిన అధికారులు
- కూటమి అధ్యయనం ..లబ్ధిదారులకు ఛాన్స్

అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణకు ఉమ్మడి జిల్లాలో భారీగా దరఖాస్తులు వెల్లువెత్తుతు న్నాయి. ప్రభుత్వం ప్రకటించిన ఎల్ఆర్ఎస్ పథకానికి అంచనాలకు మించిన స్పందన వ్యక్తమవుతోంది. అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణకు భారీగా దరఖాస్తులు వస్తున్నాయి. ఇప్పటి వరకు 15,598 దరఖాస్తులు పోటెత్తాయి. దీన్ని బట్టి గత వైసీపీ సర్కారు హయాంలో ఏ స్థాయిలో అక్రమ లేఅవుట్లు పురుడు పోసుకున్నాయో అర్థం చేసుకోవచ్చు. మరో పక్క వచ్చిన ఎల్ఎఆర్ఎస్ దరఖాస్తుల ద్వారా ప్రభుత్వానికి రూ.127 కోట్ల వరకు రాబడి రానుంది. అత్యధికంగా తూర్పుగోదావరి జిల్లాలో 7,390 ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు రావడం విశేషం. వచ్చే నెల వరకు గడువు ఉండడంతో వీటి సంఖ్య మరింత పెరగనుంది.

- (కాకినాడ,ఆంధ్రజ్యోతి)

రాష్ట్రప్రభుత్వం ఈ ఏడాది జూలైలో లేఅవుట్ క్రమబద్ధీకరణ పథకాన్ని (ఎల్ఆర్ఎస్) ప్రవేశ పెట్టింది. అనుమతుల్లేకుండా వేసిన లేఅవుట్లను ఈ పథకం ద్వారా క్రమబద్ధీకరించుకునే అవకాశం కల్పించింది. దీంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వేలల్లో దరఖాస్తులు పోటెత్తుతున్నాయి. వాస్తవా నికి 2014-2019 మధ్య అప్పటి టీడీపీ ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ పథకాన్ని తెచ్చింది. ఆ తర్వాత గడువు ముగియడంతో నిలిపివేసింది. అప్పట్లో వచ్చిన దరఖాస్తుల్లో 65 శాతం వరకు పరిష్కరించింది. గత వైసీపీ ప్రభుత్వంలో మళ్లీ అనుమతులు తీసుకోని అక్రమ భవనాలు, లేఅవుట్లు భారీగా పెరిగాయి. అప్పటి అధికార పార్టీ నేతలు, వారి అనుచరులు ఎక్కడికక్కడ అక్రమ లేఅవుట్లు వేసి విక్రయించి కోట్లు గడిం చారు. ఇవన్నీ తెలిసినా అధికారులు పట్టించు కోలేదు. అత్యధికంగా తూర్పుగోదావరి జిల్లాలోని రాజమహేంద్రవరం రూరల్, కొవ్వూరు, నిడద వోలు, రాజానగరం, కాకినాడ రూరల్ నియోజక వర్గాల్లో ఈ తరహా లేఅవుట్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి.

నాటి ధరలే నేడూ..

అనధికార లేఅవుట్లలో స్థలాలు కొనుగోలు చేసిన వారు ఇళ్లు నిర్మించుకునేందుకు అవకాశం లేదు. దీంతో వారంతా లబోదిబోమన్నారు. ప్రభుత్వం మారాక వీటిపై అధ్యయనం చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు.ఈ నేపథ్యంలో ఎల్ఆర్ఎస్ ద్వారా వీటి క్రమబద్ధీకర ణకు ప్రభు త్వం అవకాశం కల్పించింది. ఈ ఏడాది జూన్ 30కి ముందు వేసిన లేఅవుట్లను ఈ పథకం కింద క్రమబద్ధీకరించు కోవడానికి ప్రభుత్వం అనుమతి జారీ చేసింది. 2014- 2019లో అప్పటి టీడీపీ ప్రభుత్వం తీసుకు వచ్చిన ఎల్ఆర్ఎస్‌లో నిర్దే శించిన బేసిక్ ధరలనే ఇప్పుడు నిర్ణయిం చారు. ఎల్ఆర్ ఎస్ అపరాధ రుసుముల కింద ప్లాట్ విస్తీర్ణం చదరపు మీటర్లలో 100 వరకు ఉంటే రూ.200,100-300 ఉంటే రూ.400, 300-500 వరకు రూ.600, 500పైన రూ.750 వరకు వసూలుకు నిర్ణయించారు. లేఅవుట్‌లో 10శాతం ఓపెన్ స్పేస్ లేకపోతే జరిమానాతో పాటు ఈ ఏడాది జూన్ 30వ తేదీ నాటికి ఆ భూమి బేసిక్ విలువలో ఓపెన్ స్పేస్ ఛార్జీల కింద 14 శాతం చెల్లించాలని ప్రభుత్వం ఆదేశించింది. క్రమబ ద్ధీకరణ కింద ఫీజులు 45 రోజుల్లోగా చెల్లిస్తే 10 శాతం, 90 రోజుల్లోగా చెల్లిస్తే ఐదు శాతం రాయితీ ప్రకటించింది. జూలైలో పథకాన్ని ప్రవేశపెట్టగా అక్టోబరు వరకు ప్రభుత్వం గడువిచ్చింది.తిరిగి వచ్చే నెల జనవరి 23వరకు పొడిగించింది.

తూర్పున 7,390..

ఉమ్మడి జిల్లాలో అత్యధికంగా తూర్పుగోదా వరి జిల్లా నుంచి ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు భారీగా పోటెత్తాయి.జిల్లాలో డిసెంబరు 1 వరకు మొత్తం 7,390 ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు వచ్చాయి. రాజమహేంద్రవరం కార్పొరేషన్ పరి ధిలో 1,305, రుడా పరిధిలో 5,266, నిడదవోలు మునిసిపాలిటీ 291, కొవ్వూరు పరిధిలో 528 వచ్చాయి. మొత్తం 5,255 దరఖాస్తుల్లో 1,384 అప్రూవల్ అవగా 522 దరఖాస్తులను తిరస్కరించారు. దరఖాస్తుల ద్వారా ఎల్ఆర్ఎస్ ఆదాయం ప్రభుత్వానికి రూ.60.88 కోట్లు సమకూరనుంది. కార్పొరేషన్ పరిధిలో రూ.27.59 కోట్లు, రుడా ద్వారా రూ.25.78 కోట్లు జమకానుంది.

కాకినాడలో 5,839

కాకినాడ జిల్లాలో 5,839 ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు రాగా రూ.44.71 కోట్లు ఆదాయం రానుంది. అత్యధికంగా కుడా పరిధిలో 4,327, కాకినాడ కార్పొరేషన్ పరిధిలో 316, ఉమ్మడి గుడాలో 305, గొల్లప్రోలు 55, పెద్దాపురం 115, పిఠాపురం 453, సామర్లకోట 58, తుని 149, ఏలేశ్వరంలో 59 చొప్పున వచ్చాయి. మొత్తం 5,839 దరఖాస్తుల్లో 2,780 అప్లికేషన్లకు ఆమో దం లభించగా 320 తిరస్కరించారు.

కోనసీమలో 2369

బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 2,369 దరఖాస్తులు వచ్చాయి. అమలాపురం మునిసిపాలిటీలో 437,అముడా 627, మండపేట 844, రామచంద్రపురం 182, ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలో 279 చొప్పున వచ్చాయి. మొత్తం దరఖాస్తుల్లో 983 ఆమోదం పొందగా 89 తిరస్కరణకు గురయ్యాయి. కోనసీమ జిల్లాలో వచ్చిన మొత్తం దరఖాస్తుల ద్వారా రూ.21.45 కోట్లు ప్రభుత్వానికి ఆదాయం సమకూరనుంది.ఉమ్మడి జిల్లా అంతా రూ.127 కోట్లు ఆదాయం సమకూరనుండగా ఇప్పటికే చాలా మంది అపరాధ రుసుములు చెల్లించడం ద్వారా సగానికిపైగానే వచ్చినట్టు అధికారులు పేర్కొన్నారు.



లాలాచెరువులో డీడీవో కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ కీర్తి చేకూరి, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, రుడా చైర్మన్ బీవీఆర్ చౌదరి, డీడీవో వీణాదేవి

పంచాయతీరాజ్‌కు డివిజన్ ఆఫీస్‌లు

కలెక్టర్ కీర్తి చేకూరి

దివాన్‌చెరువు, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి) : పంచాయితీరాజ్ వ్యవస్థ కార్యకలాపాలను సమర్థవంతంగా పర్యవేక్షించేందుకు డివిజనల్ అభివృద్ధి అధికారి (డీడీవో) కార్యాలయాలు ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. జిల్లాలో రాజమహేంద్రవరం, కొవ్వూరు డివిజన్ పరిధుల్లో గురువారం డీడీవో కార్యాలయాలు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వర్చువల్‌గా ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ లాలాచెరువు హౌసింగ్‌బోర్డు కాలనీలో రాజమహేంద్రవరం డివిజనల్ అభివృద్ధి అధికారి కార్యాలయాన్ని ఏర్పాటు చేశామన్నారు. రెవెన్యూ వ్యవస్థలో ఆర్డీవో విధానం ఉన్నట్టుగా పంచాయతీ రాజ్ వ్యవస్థ బలోపేతానికి ఈ డివిజనల్ అభివృద్ధి అధికారి వ్యవస్థ ప్రవేశపెట్టారని చెప్పారు. డివిజనల్ గ్రామ పంచాయతీ అధికారి, డీడీవో ఉపాధి హామీ పథకం(నరేగా) అధికారులు ఒకో చోట నుంచి పనిచేయడం ద్వారా పరిపాలనలో వేగం,జవాబుదారీతనం పెరుగుతుందన్నారు. ఇప్పటి వరకూ అభివృద్ధి పనుల నిమిత్తం మండలస్థాయిలో ఎంపీడీవోను సంప్రదించేవారని ఇకపై డివిజనల్ స్థాయిలోనూ సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ ఉపాధి హామీ పనులను పర్యవేక్షించడానికి ఈ వ్యవస్థ దోహదపడుతుందన్నారు. గ్రామ సచివాలయాల పనితీరును విశ్లేషించి లోపాలను తక్షణమే పరిష్కరించే విధంగా ఈ కార్యాలయాలు పనిచేస్తాయని చెప్పారు. అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ చాలాకాలం తరువాత పంచాయితీరాజ్ పరిపాలనలో క్రమబద్ధీకరణ సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, డీపీవో వి.శాంతమణి, డీడీవో పి.వీణాదేవి, డీఎల్‌పీవో ఎం.నాగలత, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బి.వి.రెడ్డి, డీఈ శ్రీనివాస్, డీఆర్‌డీఏ పీడీ ఎన్వీవీఎస్.మూర్తి, డ్వామా పీడీ నాగమహేశ్వరరావు, సమగ్రశిక్ష పీవో ఎస్.సుభాషిణి , హౌసింగ్ పీడీ నాతి బుజ్జి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అవినాష్, ఎంపీడీవో జె.ఝాన్సీ, తహశీల్దార్ దేవి పాల్గొన్నారు.

కొవ్వూరులో ఏర్పాటు

కొవ్వూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేసి ప్రజలకు పరిపాలన అందుబాటులో ఉండే విధంగా డిప్యూటీ సీఎం కొణిదల పవన్‌కల్యాణ్ చర్యలు తీసుకుంటున్నారని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు డీడీవో కార్యాలయాన్ని గురువారం ప్రారంభించి మాట్లాడారు.రూ. 19 లక్షలతో డీడీవో కార్యాలయాన్ని ఆధునీకరించామన్నారు.కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, మద్దిపట్ల శివరామకృష్ణ, ఏఎంసీ చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్, ఎంపీపీ కాకర్ల నారాయుడు, సూరపనేని చిన్ని, డీఎల్‌డీవో ఎ.స్లీవారెడ్డి పాల్గొన్నారు.

నైపుణ్యం, భాషపై పట్టు ఉంటే విదేశాల్లో ఉపాధి

న్యాక్ అదనపు డైరెక్టర్ మనోహర్

ధవళేశ్వరం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నైపుణ్యం, భాషపై పరిజ్ఞాన కల వారికి విదేశాల్లో ఉపాధికి కొదువ లేదని ఏపీఎస్‌డీసీ జీఎం, న్యాక్ అదనపు డైరెక్టర్ జనరల్ మనోహర్ అన్నారు. ఐటీఐ ఎలక్ట్రీషియన్ పూర్తి చేసిన విద్యార్థులకు విదేశాల్లో ఉపాధి అవకాశాలు మెరుగు పరచడానికి ఏపీఎస్ఎస్‌డీసీ, ఓఎంక్యాప్, న్యాక్ సంయుక్త ఆధ్వర్యంలో బొమ్మూరు కలెక్టరేట్‌లో ఉన్న న్యాక్ భవనంలో గురువారం జర్మన్ భాషపై శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. శిక్షణకు 30 మంది విద్యార్థుల ఎంపికయ్యారని తెలిపారు. జర్మన్ భాషను పట్టుదలగా నేర్చుకోవాలన్నారు. ఎంత బాగా నేర్చుకుంటే అంత ఉపాధి లభిస్తుందన్నారు. జర్మనీలో ఎలక్ట్రీషియన్ల కొరత ఉందన్నారు. ఇండో యూరో సింక్రినైజేషన్ ఎండీ వి. శ్రీరాజ్,హేమా చౌదరి మాట్లాడుతూ జర్మనీలో అందుబాటులో ఉన్న ఉపాధి మార్గాలు, వృత్తి నైపుణ్యం ఉన్న వారికి అవకాశాలు వివరించారు. ప్రతి ఒక్కరూ తమ ప్రతిభను మెరుగు పరుచుకోవాలాన్నారు. వృత్తిలో నైపుణ్యత ఉంటే అవకాశాలు వాటంతటవే వస్తాయన్నారు. యువత వృత్తి నైపుణ్యత సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాక్ డిప్యూటీ డైరెక్టర్ మురళి, జె.రాజు, న్యాక్ సిబ్బంది,శిక్షణకు హాజరైన విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పొగాకు రైతుల ప్రయోజనాలు కాపాడాలి

పార్లమెంట్‌లో ఎంపీ పురందేశ్వరి

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పొగాకు పంటపై సుమారు 2 కోట్ల మంది రైతు కూలీలు, 60 లక్షల మందికి పైగా రైతులు ఆధారపడి ఉన్నారని, పన్నుల్లో మార్పులు చేసేసమయంలో వారి ప్రయోజనాలను తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకోవాలని రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి కోరారు. పార్లమెంట్‌లో పొగాకు, సంబంధిత ఉత్పత్తులపై జరిగిన చర్చలో గురువారం ఆమె పాల్గొని మాట్లాడారు. పొగాకు ఉత్పత్తులపై పన్నులు విధించే సమయంలో ఆ పంట సాగుపై ఆధారపడిన రైతులు, రైతు కూలీల జీవనోపాధిపై పడే ప్రభావాన్ని కూడా కేంద్రం దృష్టిలో పెట్టుకోవాలని సూచించారు. అలాగే, పొగాకు రైతులను వైవిధ్యమైన పంటల సాగు వైపు ప్రోత్సహించే చర్యలు చేపట్టాలని ఆమె కోరారు.

జిల్లాకు మరో ఫైర్‌స్టేషన్

నేడు ఎమ్మెల్యే గోరంట్ల శంకుస్థాపన

రాజమహేంద్రవరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం రూరల్‌లో నూతనంగా రూ.2.25 కోట్లతో నిర్మించే అగ్నిమాపక కేంద్రానికి శుక్రవారం ఉదయం 10.10గంటలకు రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి శంకుస్థాపన చేస్తారని జిల్లా ఫైర్ అధికారి మార్టిన్ లూథర్ కింగ్ తెలిపారు. రాజమహేంద్రవరం రూరల్ పరిధిలో ఫైర్ సర్వీసు సేవలకు వెసులుబాటు కలుగుతుందన్నారు.

నేడే బడి పండుగ

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు పూలు, మామిడి తోరణాలతో అలంకరించుకున్నాయి. పిల్లల బంగారు భవితకు బాటలు వేసే దిశగా పెద్దల సూచనలు స్వీకరించడానికి

కార్యక్రమం సాగుతుందిలా..

శుక్రవారం ఉదయం 9నుంచి 9.30 గంటల వరకూ స్వాగత కార్యక్రమం, తరగతి గదుల్లో కూర్చో వడం ఉంటుంది. 9.30 నుంచి 10.30 గంటల వరకూ హెచ్‌పీసీపై తల్లిదండ్రులతో టీచర్ల చర్చ, అసెస్ పుస్తకాలపై వివరణ, లీప్ యాప్, కేరీర్ గైడెన్స్, మానసిక ఆరోగ్యం, నైపుణ్య విద్య, పిల్లల పట్ల ప్రవర్తించకూడని తీరు, బాలికల విద్య విశిష్టత, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, పిల్లల పట్ల పెద్దల సానుకూల దృక్పథం వంటి వాటిపై వీడియోల ప్రదర్శన, 10.50 నుంచి 11గంటల వరకూ స్పోర్ట్స్ కిట్లు, లైబ్రరీ పుస్త కాలు, ఏటీఎల్/స్టెమ్ ల్యాబ్స్, పిల్లలు తయారు చేసిన క్రాఫ్ట్, సైన్స్ ప్రాజెక్టులను తల్లిదండ్రులు చూస్తారు. 11నుంచి 12.45 గంటల వరకూ పాఠశాల, అకడమిక్ ప్రోగ్రెస్, బాలికల చేత సెల్ఫ్ డిఫెన్స్ ప్రదర్శన, టీచర్లు, ప్రజాప్ర తినిధులు, తల్లిదండ్రుల సందేశాలు ఉంటాయి. 12.45 గంటలకు అందరూ కలిసి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలోని భోజ నం చేశాక ఇళ్లకు వెళతారు. ఈ మేరకు ఇప్పటికే ప్రభుత్వం నిధులు విడుదల చేసింది.

1574 పాఠశాలల్లో ప్రత్యేక ఏర్పాట్లు

ఈ ఏడాది 'మెగా పేరెంట్ టీచర్ మీటింగ్'కి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. జిల్లాలో 988 ప్రభుత్వ, 586 ప్రైవేటు పాఠశాలల్లోని 2,37,754 మంది విద్యార్థులు వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అధికారులు, ఆ ప్రాంతంలోని ప్రజా ప్రతినిధులు తదితరులు కలిపి సుమారు 5 లక్షల మంది వేడుకలకు హాజరుకానున్నారు. పిల్లల బంగారు భవితకు బడి వైపు ఒక్క అడుగు ముందుకు అనే నినాదంతో భారీ కార్యక్రమానికి పాఠశాలలను సిద్ధం చేశారు. ఇప్పటికే ఆయా పాఠశాలల ప్రధానో పాధ్యా యులు, ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు/సంరక్షకులకు బడి పండుగకు రావాలంటూ ఆహ్వానం పలికారు.కార్యక్రమ నిర్వహణపై ఇప్పటికే కలెక్టర్ కీర్తి చేకూరి సమీక్ష చేసి స్పష్టమైన ఆదేశాలిచ్చారు. హోలి స్టిక్ ప్రోగ్రెస్ కార్డుల పంపిణీ, విద్యార్థుల ప్రదర్శనలు, వ్యక్తిగత అంచనాలు, విద్యార్థుల ఆరోగ్యంపై చర్చ వంటి వాటితో పాఠశాల, సమాజం అనుసంధానాన్ని బలోపేతం చేసే విధంగా కార్యక్రమాలను రూపొందించారు. పూర్వ విద్యార్థులను భాగస్వాములను చేశారు.

నాడు అలా - నేడు ఇలా

గత వైసీపీ ప్రభుత్వంలో అటు ఉపాధ్యాయులకు బోధనకు సమయం లేకపోగా.. ఇటు

పీటీఎంకు 5 లక్షల మంది హాజరవుతారని అంచనా

విద్యార్థుల చదువు అటకెక్కింది. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత రేపటి పౌరుల బంగారు భవిత కోసం అక్షరం ముఖ్యమని విద్యారంగాన్ని గాడిలో పెట్టే పని మొదలు పెట్టింది. విద్యా మంత్రిగా పగ్గాలు చేపట్టిన నాటి నుంచే విద్యారంగాన్ని నారా లోకేశ్ గాడిలో పెట్టడంపై ప్రత్యేక దృష్టి సారించారు. ఆ మేరకు ప్రతి పాఠశాలలోని ప్రతి విద్యార్థిపై దృష్టి సారించారు. విద్యార్థి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు/సంరక్షకులు కూర్చుని విద్యార్థి భవిష్యత్తు, బడి అభివృద్ధే లక్ష్యంగా చర్చిస్తారు.

అందరూ హాజరుకావాలి...

ఇదొక అద్భుతమైన ఆత్మీక కలయిక. అన్ని ఏర్పాట్లూ చేశాం. పిల్లల బంగారు భవితకు, విద్యాలయ అభివృద్ధికి స్నేహపూర్వక వాతావరణంలో చర్చ జరుగుతుంది. ఇప్పటికే సన్నద్ధత కార్యక్రమాలు చేయించాం. పీటీఎంకి వచ్చే వారందరికీ భోజన ఏర్పాట్లు చేశాం. ఇప్పటికే ఆహ్వానాలు వెళ్లాయి.ఆత్మీయ కలయికకు అందరూ హాజరుకావాలని కోరుతున్నాం.

- కె.వాసుదేవరావు, డీఈవో

విద్యుదాఘాతంతో కూలీ మృతి

8



సీఎంతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముప్పిడి

2027 పుష్కరాలకు నిధులివ్వండి

సీఎంకు ఎమ్మెల్యే ముప్పిడి వినతి

కొవ్వూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రానున్న 2027 గోదావరి పుష్కరాలకు కొవ్వూరు నియోజకవర్గానికి నిధులు మంజూరు చేయాలని సీఎం నారా చంద్రబాబు నాయుడిని కోరినట్టు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తెలిపారు. రాజధాని అమరావతిలో గురువారం సీఎం చంద్రబాబును కలిసి శాఖలవారీగా తయారుచేసిన ప్రతిపాదనలను అందజేశారు. పంచాయతీరాజ్ శాఖ ద్వారా రూ.4159 లక్షలు, ఎండోమెంట్ ఆధ్వర్యంలో దేవాలయాల పునరుద్ధరణకు రూ.22 కోట్లు, టూరిజంకు రూ. 34 కోట్ల ప్రతిపాదనలను సీఎంకు అందించామన్నారు. అనంతరం సీఎంవో కార్యాలయంలో మునిసిపల్‌శాఖ మంత్రి పి.నారాయణను కలిసి కొవ్వూరు మునిసిపాలిటీని గ్రేడ్ 1 మునిసిపాలిటీగా అప్‌గ్రేడ్ చేయాలని కోరామన్నారు. దీనిపై సానూకూలంగా స్పందించిన మంత్రి అక్కడే ఉన్న ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్‌కుమార్‌ను మునిసిపాలిటీ అప్‌గ్రేడ్‌కు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారన్నారు. సీఎస్ ప్రతిపాదనలు సమర్పించాలని మునిసిపల్ కమిషనర్‌కు ఫోన్ చేసి ఆదేశించారని చెప్పారు.

పది విద్యార్థులు పట్టుదలగా చదవండి : డీఈవో



కొవ్వూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పదవతరగతి విద్యార్థులు పట్టుదలతో చదవి, మంచిమార్కులతో ఉత్తీర్ణత సాధించాలని డీఈవో కె.వాసుదేవరావు అన్నారు. కొవ్వూరు మండలం పంగిడి పీఎంఏ ఉన్నత పాఠశాలను గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. పది విద్యార్థులకు దిశ, నిర్దేశం చేశారు. 100 రోజుల ప్రణాళికలో విద్యార్థు లు ఏకాగ్రతతో చదవాలన్నారు. పీఎంశ్రీ పాఠశాల అభివృద్ధి పనులకు నిధుల కొరత లేదన్నారు. పాఠశాల విద్యార్థులకు ఐడీ కార్డులు పంపిణీ చేశారు.కార్యక్రమంలో ఎస్ఎస్ఏ అధికారి గౌరీశంకర్, చీఫ్ మానిటరింగ్ అధికారి శ్రీనివాసరావు, హెచ్‌ఎం మంగెన శ్రీరామారావు, టీచర్లు పరమేశ్వరశాస్త్రి, మధులత, ధనరాజు, అరుణకుమారి,రవికుమార్, కృష్ణవేణి, నాగేంద్ర, అచ్చయ్య, మురళీ పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్ట్ ఎన్‌క్లేవ్ స్థలం పరిశీలన

కోరుకొండ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎయిర్ పోర్ట్ ఎన్‌క్లేవ్ స్థలాన్ని గురువారం ఆర్‌డీవో ఆర్.కృష్ణ నాయక్, విశాఖ సబ్ డివిజనల్ ఆఫీసర్,ఎయిర్ పోర్ట్ అధికారులతో కలిసి సంయుక్తంగా పరిశీలించారు. కోరుకొండ మండలం బూరుగుపూడిలో సర్వే నెంబర్లు 403, 366, ఎల్‌పీఎం నెంబర్లు 1502 మొదలైన వాటిలో ప్రతిపాదించిన ఎన్‌క్లేవ్ స్థలం ఉందన్నారు.వారి వెంట కోరుకొండ తహశీల్దార్ సుస్వాగతం, సర్వేయర్లు పాల్గొన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డీవో కృష్ణ నాయక్

కొవ్వూరు

• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

ఉద్యోగుల సమస్య పరిష్కారానికి ఏపీ ఎన్జీవో సంఘం కృషి

● సంఘం జిల్లా కమిటీ చైర్మన్ మీసాల మాధవరావు



మున్సిపల్ మేనేజర్ భరత్ నుంచి సభ్యత్వం స్వీకరిస్తున్న నాయకులు

కొవ్వూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్య పరిష్కారం కోసం ఏపీ ఎన్జీవో కృషి చేస్తోందని ఆ సంఘం జిల్లా కమిటీ చైర్మన్ మీసాల మాధవరావు అన్నారు. గురువారం పట్టణంలోని మున్సిపాల్టీ, రిజిస్ట్రార్, వైద్య ఆరోగ్యశాఖ, ట్రెజరీ, వ్యవసాయ శాఖ కార్యాలయాల్లో సంఘ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. మున్సిపల్ కార్యాలయంలో మేనేజర్ భరత్ నుంచి సభ్యత్వం స్వీకరించారు. ఈ సందర్భంగా ఏపీఎన్జీవో జిల్లా కమిటీ చైర్మన్ మీసాల మాధవరావు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారంతో పాటు పెండింగ్ డీఏలు, పీఆర్సీ ఏర్పాటుకు ఏపీ ఎన్జీవో సంఘం కృషి చేస్తోందన్నారు. రాష్ట్ర జేఏసీ చైర్మన్ విద్యాసాగర్ నేతృత్వంలో ఉద్యోగుల సమస్యలు త్వరలో పరిష్కారం అవుతాయన్నారు. త్వరలో కొవ్వూరు యూనిట్ ఏపీ ఎన్జీవో సంఘం ఎన్నికలు నిర్వహించనున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు వెంకటరమణ, రాష్ట్ర జేఏసీ కార్యదర్శి వేణు మాధవరావు, జిల్లా ట్రెజరీ సంఘ ఉపాధ్యక్షుడు సీహెచ్ విజయకృష్ణ, రాష్ట్ర కౌన్సిలర్ సత్యమూర్తి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మానవత ఆధ్వర్యంలో దివ్యాంగుల దినోత్సవం



చాగల్లులో దివ్యాంగుల దినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

చాగల్లు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం చాగల్లులో గురువారం మానవత స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ కేతా సాహెబ్ ఇంటి వద్ద, భవిత కేంద్రం వద్ద జరిగిన వేడుకల్లో కేక్ కటింగ్ చేసి స్వీట్లు పంచారు. భవిత కేంద్రానికి టీచింగ్ ఎయిడ్స్ నిమిత్తం రూ. 5 వేలు చెక్కును అందజేశారు. ఇటీవల భద్రకాళ భర్త మృతి చెందడంతో వారి కుటుంబ సహాయార్థం రూ. 5 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు కరుటూరి సతీష్, మానవత సంస్థ అధ్యక్షుడు జుజ్జవరపు వెంకట కృష్ణప్రసాద్, మదర్ థెరిసా సేవా సంఘం అధ్యక్షుడు పోలిశెట్టి శ్రీనివాసరావు, ఎంఈవో-2 సుభాకర్, తదితరులు పాల్గొన్నారు.

చలో విశాఖను జయప్రదం చేయండి

నిడదవోలు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు 31 నుంచి జనవరి 4 వరకు విశాఖలో జరిగే మెప్మా ఆర్పీల బహిరంగ సభను జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకులు జువ్వల రాంబాబు పిలుపునిచ్చారు. గురువారం నిడదవోలు మున్సిపల్ కార్యాలయంలో మెప్మా ఆర్పీలంతా కలిసి ఛలో విశాఖ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ 18వ సీఐటీయూ అఖిలభారత మహాసభలు జయప్రదం చేయాలన్నారు. దీనికి కేరళ సీఎం విజయ్ హాజరవుతున్నారన్నారు. ఆర్పీలు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న మెప్మా ఆర్పీలు

బాలాత్రిపురసుందరికి పౌర్ణమి పూజలు



కొవ్వూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో వేంచేసియున్న శ్రీబాలాత్రిపుర సుందరి సమేత సుందరేశ్వరస్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మార్గశిర పౌర్ణమిని పురస్కరించుకుని ఆలయ అర్చకులు మానేపల్లి శ్రీనివాసశాస్త్రి పర్యవేక్షణలో సుందర గణేష్ ఆధ్వర్యంలో అమ్మవారిని వివిధ రకాల పత్రిలతో అలంకరించారు. సాయంత్రం లలితా సహస్రనామ పారాయణం చేశారు. కార్యక్రమంలో పట్టణ, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అధ్వానంగా రోడ్లు.. పట్టించుకోరూ..!

● ప్రజలకు తప్పని తిప్పలు

దేవరపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల రహదారులు అధ్వానంగా ఉన్నాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. లక్ష్మీపురం - పల్లంట్ల, దేవరపల్లి నుంచి కురుకూరు, యర్నగూడెం నుంచి త్యాజంపూడి, యాదవోలు నుంచి పొంగుటూరు రోడ్లు పెద్దపెద్ద గోతులతో నిండిపోయాయి. దీనిపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి మరమ్మతులు చేపట్టాలని పలువురు వాహనదారులు, స్థానిక ప్రజలు కోరుతున్నారు.



దేవరపల్లి - పల్లంట్ల రోడ్డు దుస్థితి

గోదావరిమాతకు మహానీరాజనం



హారతులు పడుతున్న మహిళలు

కొవ్వూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో అఖండ గోదావరి మాతకు 243వ మాసోత్సవ మహానీరాజనం అందజేశారు. మార్గశీర్ష పౌర్ణమిని పురస్కరించుకుని గోదావరి నీరాజన సమితి ఆధ్వర్యంలో గురువారం గోష్పాదక్షేత్రంలోని ప్రధాన స్నానఘట్టంలో వేంచేసియున్న గోదావరి మాతకు ప్రదోషకాలంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వివిధ రకాల హారతులతో నీరాజనం సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

భక్తాంజనేయస్వామికి పూజలు



చాగల్లు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): చాగల్లు సెంటర్‌లోని శ్రీభక్తాంజనేయస్వామి వారి జయంతి ఉత్సవాలు వేడుకగా జరుగుతున్నాయి. గురువారం స్వామి వారికి కదళీ ఫల అర్చన నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

జ్ఞాన సరస్వతీ ధ్యాన మందిరంలో చండీహోమం



హోమం నిర్వహిస్తున్న పండితులు

కొవ్వూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో వేంచేసియున్న జ్ఞాన సరస్వతీ ధ్యాన మందిరంలో గురువారం ఘనంగా చండీహోమాన్ని నిర్వహించారు. ఆత్మీయ హితకారిణి సమాజం ఆధ్వ ర్యంలో తిప్పాభట్ల సుబ్రహ్మణ్యం, గంప వెంకట నాగకృష్ణారావు సహకారంతో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు.కార్యక్రమంలో పమ్మి రవిబాబు, కస్తూరి కాంతారావు, ముష్టి శ్రీరామచంద్రమూర్తి, మల్లంపల్లి చంద్రశేఖర్, దామరాజు సచ్చిదానంద తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని భార్యాభర్తలు మృతి

● మరో ఇద్దరికి తీవ్రగాయాలు
● పుట్టిన మూడు నెలలకే తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారి



మృతిచెందిన మృతురాలు లీలా ప్రసాద్, సౌమ్య(ఫైల్)

రాజానగరం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై రాజానగరం-నరేంద్రపురం కూడలిలో లారీ ఢీకొని భార్యాభర్తలు అక్కడికక్కడే మరణించారు. మరో ఇద్దరు మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. తూర్పుగోదావరిజిల్లా రాజానగరం మండలం నందరాడ గ్రామానికి చెందిన జుత్తుక లీలా ప్రసాద్ (20), రాజమహేంద్రవరం సమీపంలోని బర్మాకాలనీకి చెందిన సురేష్ సౌమ్య(21)తో ప్రేమ వివాహం జరిగింది. వీరికి మూడు నెలల కిందట పాప కూడా జన్మించింది. లీలా ప్రసాద్ ఎలక్ట్రికల్ పనిచేసుకుంటూ భార్యను పోషించుకుంటున్నాడు. ఈనేపథ్యంలో గురువారం మధ్యాహ్నం బ్యాంకు పనినిమిత్తం ఇరువురు మోటారు సైకిల్‌పై రాజానగరం బయలు దేరారు. రాజానగరం- నరేంద్రపురం కూడలి వద్ద హైవే దాటుతున్న త రుణంలో రాజమ హేం ద్రవరం నుంచి వైజాగ్ వైపుగా వేగంగా, నిర్లక్ష్యం గా వస్తున్న లారీ మో టా ర్ సైకిల్‌ను బలంగా ఢీకొంది. ఈప్రమాదంలో మోటార్ సైకిల్‌పై ప్రయాణిస్తున్న లీలా ప్రసాద్, సురేష్ సౌమ్యలు లారీచక్రాల కింద పడి అక్కడికక్కడే మృతి చెందారు. అలాగే ఇదే ప్రాంతంలో మరో ఇద్దరు మహిళలను కూడా లారీ ఢీకొనడంతో ఇరువురికి తీవ్రగాయాలయ్యాయి. గాదరాడకు చెందిన వెంకటలక్ష్మికి కుడికాలుకు బలమైన గాయాలుకాగా, సూర్యకుమారికి కుడికాలుకు మడమ నుజ్జునుజ్జయింది. క్షతగాత్రులను చికిత్సకోసం రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈమేరకు మృతుల బంధువు సత్తిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఎస్.ప్రసన్న వీరయ్యగౌడ్ తెలిపారు.

ఉచిత ఫెర్టిలిటీ వైద్యసేవలు

అనపర్తి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సంతానం కోసం ఎదురుచూసే వారి కోసం ఉచితంగా నిర్వహిస్తున్న ఒయాసిస్ ఫెర్టిలిటీ సేవల కోసం జననీ యాత్రను శుక్రవారం అనపర్తిలో నిర్వహిస్తున్నట్టు ఒయాసిస్ జననీ యాత్ర నిర్వాహకులు గురువారం విలేకరులకు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు కళావేదిక వద్ద సేవలందిస్తారు.

మండల సర్వసభ్య సమావేశం



నిడదవోలులో మాట్లాడుతున్న భాగ్యలక్ష్మి

నిడదవోలు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజాసమస్యల పరిష్కారానికి గ్రామస్థాయి అధికారులంతా కృషిచేయాలని ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి అన్నారు గురువారం సమిశ్రగూడెంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య పరిరక్షణ, తాగునీటి సమస్యలపై గ్రామస్థాయి అధికారులు దృష్టిపెట్టాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో టీవీ రామారావు, జడ్పీటీసీ కొయ్యే సూరిబాబు, పంచాయతీ సర్పంచ్, కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దత్త జయంతి



దత్త జయంతి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

కొవ్వూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో వేంచేసియున్న శ్రీషిరిడిసాయి ఆధ్యాత్మిక కేంద్రంలో దత్త జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురువారం సుందరసాయి మందిర ప్రాంగణంలో సామూహిక దత్తాత్రేయ వ్రతములు నిర్వహించారు. ఉదయం నుంచి దత్తాత్రేయ స్వామికి ఏకవార అభిషేకములు, అర్చనలు చేశారు. బ్రహ్మశ్రీ తుట్టగుంట భైరవమూర్తిచే సామూహిక గురుచరిత్ర పారాయణం చేశారు. దోర్బల ప్రభాకరశర్మ దత్త జయంతి సందేశం అందజేశారు. గుడివాక శ్రీనివాస్, కసిరెడ్డి సీతారామయ్య, సురేష్, రాంబాబు, భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో కూలీ మృతి

నల్లజర్ల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆయిల్ పామ్ గెలలు కోస్తున్న వ్యవసాయ కూలీ విద్యుత్ షాక్‌కు గురై గురువారం మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి. పుల్లలపాడుకి చెందిన ఆరేపల్లి సోమరాజు (35) ఆయిల్‌పామ్ గెలలు కోస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో గురువారం ఉదయం ప్రకాశరావుపాలెంకి చెందిన రైతు గద్దే సత్యనారాయణకు చెందిన తోటలో గెలలు కోసే క్రమంలో ప్రమాదవశాత్తు ఇనుప గెడ విద్యుత్ వైర్లకు తాకడంతో విద్యుత్ సరఫరా అయ్యి సోమరాజు అక్కడిక్కడే మృతిచెందాడు. ఈయనకి భార్య మౌనిక, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ దుర్గాప్రసాద్ పేర్కొన్నారు.

భార్యపై భర్త దాడి.. కేసు నమోదు

నిడదవోలు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పురుషోత్తపల్లికి చెందిన గుంజే పుష్ప తన భర్త గుంజే ఏసు మద్యానికి బానిసై ఇంట్లో సామాన్లు అమ్మివేస్తుండడంతో గురువారం ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. దీంతో ఏసు తన భార్యను కొట్టడంతో రక్త గాయాల య్యాయి. ప్రసుత్తం ఆమె నిడదవోలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతోంది. ప్రభుత్వాసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు సమిశ్రగూడెం పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ ఎస్‌వీ శేఖర్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

బాల్య వివాహాలు నేరం



రంగాపురంలో ప్రతిజ్ఞ చేస్తున్న గ్రామస్థులు, కూటమి నేతలు

బిక్కవోలు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, అందువల్ల అటువంటి వివాహాలను ప్రోత్సహించరాదని కూటమి నేతలు తెలిపారు. గురవుఆరం రంగాపురంలోని అంగన్వాడీ కేంద్రాల్లో నెలవారీ పౌష్టికాహార పంపిణీ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాలను చేయబోమని గ్రామస్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు జరిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కేతా ఏసురత్నం, కూటమి నేతలు నడింపిల్లి చిరంజీవిరాజు, చేల్లే జోష్‌బాబు, మారిశెట్టి శ్రీను, ఆరోగ్య సిబ్బంది సుకన్య, హలీమా, అంగన్వాడీలు గనికమ్మ, మార్తమ్మ, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

● ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీ రమణ



కార్మికశాఖ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు

కొవ్వూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీ రమణ డిమాండ్ చేశారు. కొవ్వూరు అసిస్టెంట్ లేబర్ కమిషనర్ కార్యాలయం ఎదుట ఐఎఫ్‌టీయు ఆధ్వర్యంలో గురువారం ఆందోళన చేపట్టారు. అనంతరం కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ గత ఆరు సంవత్సరాలుగా కార్మిక సంక్షేమ బోర్డును నిలుపుదల చేశారని, కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలన్నారు. పెండింగ్ క్లైమ్‌లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

15న చలో కలెక్టరేట్

ఈనెల 15వ తేదీన చలో కలెక్టరేట్ పిలుపు అమలు చేయాలని ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఈ.గ్రీష్మకుమార్ పిలుపునిచ్చారు. పౌరహక్కుల సంఘం నాయకులు నంబూరి శ్రీమన్నారాయణ మాట్లాడుతూ కార్మికుల న్యాయమైన కోర్కెలు తీర్చాలని, తక్షణం సంక్షేమ బోర్డును పునరుద్ధరించకపోతే హైకోర్టును ఆశ్రయిస్తామన్నారు. కార్యక్రమంలో ఈ.మల్లిక, పి.వెంకన్న, ఎం.శ్రీనివాస్, వి.రాజేష్, బి.బ్రహ్మం, ఎస్.శ్రీను, రామకృష్ణ, నూకరాజు, ఆర్.హరీష్, ఐఎఫ్‌టీయు పట్టణ కమిటీ, ఎలక్ట్రికల్ వర్కర్స్, ప్లంబింగ్ వర్కర్స్, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ యాదవోలు గ్రామ అనుబంధ కమిటీలు



నియామక పత్రాలు అందజేస్తున్న మండల వైసీపీ అధ్యక్షుడు కూచిపూడి సతీశ్

దేవరపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వైసీపీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయడానికి అన్ని గ్రామాల్లో అనుబంధ కమిటీలు ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కూచిపూడి సతీశ్ అన్నారు. గురువారం యాదవోలులో వైసీపీ గ్రామ అనుబంధ విభాగ కమిటీలను నియమించారు. గ్రామ వైసీపీ అధ్యక్షుడిగా నాగ శ్రీను, గ్రామ మహిళా అధ్యక్షు రాలిగా నాగప్రసన్న, డివిజన్ విభాగాధ్యక్షుడిగా ఎండీ జాకీర్, రైతు అధ్యక్షుడిగా చిలకా వీరవెంకట సత్యనారాయణ, సోషల్ మీడియా అధ్యక్షుడిగా ఎస్‌కే సాదిక్, బీసీ సెల్ అధ్యక్షుడిగా దండు వీరపండు, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా కరుటూరి రామకృష్ణను కమిటీలుగా ఎన్నుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సున్నం వరప్రసాద్, ఉప సర్పంచ్ ఆరేటి సూర్యనారాయణ, నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎస్‌కే.ముస్తాఫా, యూత్ విభాగం అధ్యక్షుడు అనిశెట్టి సూర్యచంద్రరావు, కురుకూరు ఎంపీటీసీ నిత్యానందం, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, వార్డు సభ్యులు, తదితరులు పాలొన్నారు.

గరుడ వాహన సేవ



దేవరపల్లిలో కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

దేవరపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): దేవరపల్లిలో శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో గురువారం మార్గశిర పౌర్ణమి సందర్భంగా ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం స్వామివార్ని గరుడ వాహనంపై అలంకరించి మాడవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అంబటి శ్రీనివాసరావు, ఆలయ ప్రధాన అర్చకులు కేశవాచార్యులు, దుర్గాప్రసాద్ ఆచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలపై ఎంపీటీసీ, సర్పంచ్ మధ్య వాదోపవాదాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ యల్లారీశ్వరి, పక్కన తదితరులు

ఉండ్రాజవరం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం జరిగింది. ఇందులో చివటం ఎంపీటీసీ సభ్యుడు వేముల సత్యనారాయణ, దమ్మెన్ను గ్రామసర్పంచ్ గురజర్ల సత్యనారాయణ మధ్య ఇళ్ల స్థలాల్లో అనర్హుల జాబితాపై హోరాహోరీగా చర్చ జరిగింది. ఎంపీపీ పాలాటి యల్లారీశ్వరి అధ్యక్షత వహించారు. హౌసింగ్ సబ్జెక్టుపై హౌసింగ్ ఏఈ వివరిస్తుండగా దమ్మెన్ను సర్పంచ్ సత్యనారాయణ కలుగజేసుకుని తమ గ్రామంలో 2018 సంవత్సరంలో ఇళ్ల స్థలాలు పొందిన వారిలో అనర్హులు ఉన్నారని, వారికి గృహాలు ఎలా మంజూరు చేస్తారని తీవ్రస్థాయిలో ప్రశ్నించారు. దీనిపై చివటం ఎంపీటీసీ సభ్యుడు వేముల సత్యనారాయణ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో ఇచ్చిన 25 లక్షల పట్టాలలో 5 లక్షల మంది అనర్హులు ఉన్నారని, వాటి సంగతి తేల్చండని పేర్కొన్నారు. తమ ప్రభుత్వంలో అర్హత ఉండి ఇళ్లస్థలం లేకపోతే వారికి 3 సెంట్లు స్థలం ఇస్తామని చెప్పారు. 2018లో ఇచ్చిన పట్టాలలో అనర్హులు ఉంటే, 2019 నుండి 2024 వరకు ఉన్న మీ వైసీపి ప్రభుత్వంలో వారిని ఎందుకు తొలగించలేదని ఎంపీటీసీ, సర్పంచ్‌ను ప్రశ్నించారు. ఈ విషయంపై తాడిపర్రు సర్పంచ్ నరేంద్ర కలుగజేసుకుని వారించే ప్రయత్నం చేశారు. ఆయన మాట వినకుండా ఒకరిపై ఒకరు కేకలు వేసుకోవడంతో దీనిపై ఎంపీపీ పాలాటి యల్లారీశ్వరి కలుగజేసుకుని సమావేశంలో ఏదైనా విషయంలపై ప్రశ్నించే అర్హత ఎంపీటీసీ సభ్యులకు మాత్రమే ఉంటుందన్నారు. ఏదైనా సమస్య ఉంటే మీ గ్రామ ఎంపీటీసీతో చర్చించండి అంతేగాని మీరు నేరుగా సమావేశంలో అడిగే అర్హత మీకు లేదని దమ్మెన్ను సర్పంచ్ సత్యనారాయణకు ఎంపీపీ యల్లారీశ్వరి చెప్పడంతో సమస్య సద్దుమణిగింది. ఈ విషయంపై తహశీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్ మాట్లాడుతూ దమ్మెన్నులో ఇళ్లస్థలాలపై 2019లోనే ఫిర్యాదులు వచ్చాయన్నారు. అప్పట్లోనే దానిపై వివరణ ఇచ్చామని, ఇటీవల సర్పంచ్ సత్యనారాయణ అనర్హులు ఉన్నారనిఫిర్యాదు ఇచ్చారని చెప్పారు. ఈ ఫిర్యాదుపై పరిశీలన చేసి అనర్హులు ఉన్నారని గుర్తిస్తేచట్టపరంగా చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ ప్రసాద్ చెప్పారు. అధికారులు వివిధశాఖలపై సమీక్షించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గాలింకి జిన్నాబాబు, ఎంపీడీవో ఎం. శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి కోసం ఏడారి దేశానికి .. హింసకు గురై ఇంటికి

● పేషెంటును చూసుకోవాలని తీసుకెళ్లి గొడ్డు చాకిరీకి పనిలో పెట్టిన వైనం
● తెలుగు ఏజెంట్లు దాష్టీకం
● 2 నెలలు తీవ్రంగా ప్రయత్నించిన భర్త
● పోలీసులు, లోకేశ్ ఆఫీస్ సిబ్బంది నిర్లక్ష్యం
● ఏజెంటుతో సెటిల్ చేసుకోవాలని ఉచిత సలహా
● చివరికి గత నెల 29న ఇంటికి చేరిన మహిళ

రాజమహేంద్రవరం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కోసం ఎడారి దేశాల దారి పడుతున్న మహిళలు మోసకారి ఏజెంట్ల మాటల వలలో పడి పనిలో చేరిన తర్వాత పడరాని పాట్లు పడుతున్నారు. ప్రాణాలతో ఇంటికి చేరతామా? అని ప్రతి క్షణం ఏడుస్తూ అక్కడ వాళ్లు.. ఆమె క్షేమంగా వస్తుందా? అనే ఆందోళనలో ఇక్కడ వాళ్లు నరకం అనుభవిస్తున్నారు. ఆ బాధను అధికారులు కూడా పట్టించుకోకపోవడం మరింత ఆవేదనకు గురిచేస్తోంది. తూర్పు గోదావరి జిల్లా చాగల్లు మండలానికి చెందిన ఎస్‌కేఎస్.బీబీ వ్యథ అటువంటిదే. ఆర్థికంగా ఇబ్బందుల నేపథ్యంలో ఎనిమిది నెలల కిందట పాలకొల్లుకు చెందిన నాగరాజు అనే ఏజెంట్ ద్వారా బీబీ మస్కట్ వెళ్లింది. అక్కడ ఒక పేషెంటును మాత్రమే చూసుకోవాలని చెప్పారు. అక్కడకు వెళ్లాక రాజమహేంద్రవరానికి చెందిన ప్రియ అనే ఏజెంటు ఆఫీసు ద్వారా ఒక ఇంట్లో పనికి చేరింది. అయితే నాగరాజు చెప్పిన పని కాకుండా.. రోజూ 14 మందికి మూడు పూటలా వండి పెట్టడం, వాళ్ల దుస్తులు ఉతకం, మూడు అంతస్తుల భవనాన్ని శుభ్రం చేయడం వంటి పనులు అప్పగించారు. దీంతో కొద్ది రోజులకే ఆమెకు నరకం కనిపించింది. అయినా ఉదయం 4 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకూ గొడ్డు చాకిరీ చేయాల్సి వచ్చేది. ఇదంతా భర్తకు చెప్పినా కొద్దిరోజుల తర్వాత సర్దుకుంటుందని అనుకున్నారు. కానీ పరిస్థితి రోజు రోజుకూ ఇబ్బందిగా మారడంతో రెండు నెలల కిందట ఆమెను ఇక్కడికి తీసుకొచ్చే ప్రయత్నాలు ఆరంభించారు. తొలుత చాగల్లు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పట్టించుకోలేదు. తర్వాత కలెక్టర్ గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చాడు. అక్కడ నుంచి మంత్రి లోకేశ్ కార్యాలయానికి సమాచారం వెళ్లడంతో.. ఆ సిబ్బంది ఆమె భర్తకు ఫోన్ చేసి ఏజెంటు ఫోన్‌కి లైన్ కలిపాడు. ఆమెను ఇండియాకు పంపాలంటే రూ.1.5 లక్షలు ఇవ్వాలని ఏజెంటు డిమాండ్ చేశాడు. అంత ఇచ్చుకోలేనని తనకు పరిచయం ఉన్న వారి ద్వారా భర్త ప్రయత్నాలు చేయడంతో మస్కట్‌లోని భారత రాయబార కార్యాలయం రంగంలోకి దిగింది. దీంతో ఆమెను పంపడానికి గత నెల 28న విమానం టికెట్ కొన్నారు. అంతకు 4 రోజుల ముందు మస్కట్‌లోని ఏజెంట్ ప్రియ కార్యాలయానికి బీబీని తీసుకెళ్లి శారీరకంగా హింసించినట్టు ఆమె వాపోయింది. కొట్టి, బూటు కాలితో తన్ని రెండు నెలల జీతం, మరికొంత సొమ్ము.. పిల్లల కోసం కొన్న చాక్లెట్లు, దుస్తులను గుంజుకున్నారని లాక్కున్నారని కన్నీటి పర్యంతమైంది. ప్రాణాలతో ఇంటికి వెళితే చాలనుకొని బీబీ ఆ బాధను పంటి బిగువున అదిమి పట్టుకొంది. చివరికి 29వ తేదీ ఉదయం ఇండియాకు చేరుకున్నారు. భర్తతో కలిసి ఆమె గురువారం కలెక్టర్ కీర్తిని కలిశారు. అక్కడ ఇంకా తమ వంటి వాళ్లు 12 మంది వరకూ హింస పడుతున్నారని, వాళ్లను రక్షించాలని బీబీ వేడుకొంది. మస్కట్‌లోని ఏజెంటు ప్రియ, పాల కొల్లుకు చెందిన నాగరాజుపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని విన్నవించింది. తన భార్య ఆరోగ్యం బాగుపడాలని లేదంటే తమ జీవితాలు నాశనమవుతాయని, ఇలా ఎవరూ మోసపోకూడదంటూ .. చివరికి కొంత సొమ్ము ఇచ్చే వరకూ ఆమెను పంపించలేదని.. ప్రాణాలతో ఇంటికి చేరదేమో అని ప్రతి క్షణం నరకం అనుభవించానని భర్త కన్నీళ్లు పెట్టుకున్నాడు.